నీలగిరి - నిత్యపద్యం

అదుపులేనిఖర్చు పిదప మిగిలినట్టి
ధనము పాదుపు జేయ దండుగేను
ఖర్చుపెట్టుమయ్య కాసింత దాఁబెట్టి
పొదుపుసూత్రమిదియె బ్రదుకునందు

మీ
విజయప్రసాద్ నలుమాసు
కవి,తెలుగు బోధకులు

# నీలగిరి ఎక్స్ ప్రెస్

తెలుగు దిన పత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.

సంచిక : 102 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | బుధవారం | 9-7-2025 | పేజిలు -8 | వెల: రూ. 5.00



## ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు
# 35 శాతం రిజర్వేషన్లు

- ఎన్నికలు సమీపిస్తున్న వేళ బీహార్ సీఎం కీలక ప్రకటన..

న్యూఢిల్లీ
బీహార్ లో ఎన్నికల వేడి మొదలైంది. ఈ ఏడాది చివరికల్లా రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించనున్నారు. దీంతో అన్ని ప్రధాన పార్టీలు ఎన్నికలకు సన్నద్ధమవుతున్నాయి. ఇక ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో నితీశ్ కుమాం వచ్చే ఎన్నికల్లో మరోసారి అధికారం నిలుపుకోవాలని చూస్తున్నారు. ఇందులో భాగంగా ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు కొత్త వ్యూహాలకు పదును పెడుతున్నారు. ఈ క్రమంలో తాజాగా కీలక ప్రకటన చేశారు.అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఆ రాష్ట్ర

-మిగతా 2 లో



## ఢిల్లీలో సీఎం రేవంత్
# బిజీ బిజీ

### పలువురు కేంద్రమంత్రులతో భేటీ

- సరిపడా యూరియా విడుదల చేయాలని నడ్డాకు వినతి
- జహీరాబాద్ ఇండస్ట్రియల్ సిటీకి సహకరించాలని గోయల్‌కు అభ్యర్థన

న్యూఢిల్లీ
న్యూఢిల్లీలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన బిజీ బిజీగా సాగుతోంది. ఈ పర్యటనలో భాగంగా పలువురు కేంద్ర మంత్రులతో సీఎం రేవంత్ వరుసగా భేటీ- అయ్యారు. అందులోభాగంగా జెపి నడ్డా, పీయూష్ గోయల్‌లతో

-మిగతా 2 లో



## కేటీఆర్ డ్రామాలు
# కట్టిపెట్టాలి

- చర్చించాలంటే అసెంబ్లీకి రావాలి
- దమ్ముంటే కేసీఆర్‌ను తీసుకుని రా
- కేటీఆర్ వ్యాఖ్యలపై మండిపడ్డ కాంగ్రెస్ నేతలు

హైదరాబాద్
కేటీఆర్‌పై కాంగ్రెస్ నేతలు మండిపడ్డారు. కెటిఆర్ డ్రామాలు ఆడడం ఆపేయాలని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అన్నారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డితో కలిసి ఆయన మంగళవారం అసెంబ్లీ వద్ద విలేకరుతో మాట్లాడారు. కేటీఆర్ ప్రెస్‌క్లబ్‌కు వచ్చి మాట్లాడిన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీకి వచ్చి చర్చించే దమ్ముంటే కేసీఆర్‌ను

-మిగతా 2 లో



# మాట తప్పడం రేవంత్‌కు అలవాటే

- ఆరు గ్యారెంటీలు..420 హామీలు మోసం
- నీళ్లు ఆంధ్రాకు...నిధులు ఢిల్లీకి.. నియామకాలు సొంతవారికి
- ప్రెస్‌క్లబ్ వద్ద కేటీఆర్ బృందం హంగామా

హైదరాబాద్
తెలంగాణ ఉద్యమం,పోరాటం నీళ్లు, నిధులు, నియామకాలకోసమే అన్నది అందరికీ తెలుసని, కాంగ్రెస్ కూడా ఇప్పుడు అదే అనుసరిస్తోందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ ఎద్దేవా చేశారు. నీళ్లేమో ఆంధ్రాకు, నిధులు రాహుల్‌కు, నియామకాలు కొందరు తాబేదార్లకు అప్పగించారని మండిపడ్డారు. మాట తప్పడం సీఎం రేవంత్‌రెడ్డికి అలవాటేనని కేటీఆర్ అన్నారు. రైతు సంక్షేమం తదితర అంవాలపై చర్చకు సిద్ధమంటూ ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరిన కేటీఆర్ మంగళవారం ఉదయం

-మిగతా 2 లో



## ట్రంప్ మరో
# టారిఫ్ బాంబ్..

### 14 దేశాలపై కొత్త వాణిజ్య సుంకాల ప్రకటన

వాషింగ్టన్
టారిఫ్‌ల విషయంలో ఏమాత్రం వెనక్కి తగ్గని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా మరో బాంబు పేల్చారు. 14 దేశాల పై కొత్త వాణిజ్య పన్నులు విధించనున్నట్లు ప్రకటించారు. అత్యధికంగా మయన్మార్, లావోస్‌పై 40 శాతం సుంకాన్ని విధించనున్నట్లు ప్రకటించారు. ఈ సుంకాలు ఆగస్టు 1వ తేదీ నుంచి అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు.అప్పటిలోపు కొత్త

-మిగతా 2 లో

## కేటీఆర్ లెక్కలకు
# సమాధానం ఉంది

### అసెంబ్లీలో ఏ అంశమైనా చర్చిస్తాం

- కృష్ణా, గోదావరి జలాలపై చర్చకు సిద్ధమే
- అసత్యాలతో ప్రజలను మభ్య పెట్టలేరు
- కేటీఆర్ విమర్శలపై భట్టి ప్రతి విమర్శలు
- మానుకోటలో పేదలకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ




మహబూబాబాద్,
బిఆర్ఎస్ అధినేత కెసిఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ లెక్కలు తీసుకొని అసెంబ్లీకి వస్తే ఏ అంశమైనా చర్చించడానికి సిద్దంగా ఉన్నామని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క తెలిపారు. కృష్ణా, గోదావరి బేసిన్ జలాలపై చర్చకు ఎప్పుడైనా సిద్ధమేనని సవాల్ విసిరారు. కాళేశ్వరం నిర్మించి పది ఎకరాలకు కూడా నీళ్లు ఇవ్వలేదని, అసత్యాలు మానకపోతే.. బిఆర్ఎస్ కు డిపాజిట్లు రావని అన్నారు. నోరుందికదా అని కెటిఆర్ ఏది పడితే అది మాట్లాడమేనా? అని భట్టి ప్రశ్నించారు. సిఎం రేవంత్ రెడ్డి ఒకరికి సవాల్ విసిరితే మరొకరు బయటకు వచ్చారని అన్నారు. మహబూబాబాద్‌లో లబ్దిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో

-మిగతా 2 లో



# రాముడి జన్మస్థలం నేపాల్

- శివుడు..విశ్వామిత్రుడు కూడా మావారే
- నేపాల్ ప్రధాని ఓలి వివాదస్పద వ్యాఖ్యలు

ఖాట్మండ్
శ్రీ రాముడు నేపాల్ వాసి అని, ఇక్కడే పుట్టాడని ఆయన జన్మస్థలంపై నేపాల్ ప్రధానమంత్రి కేపీ శర్మ ఓలి మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. రాముడు తమ దేశంలోనే జన్మించాడని ఆయన పేర్కొన్నారు. అలాగే భగవాన్ శంకర్, విశ్వామిత్ర మహర్షి కూడా ఇక్కడే పుట్టారని అన్నారు. అందుకు తగిన ఆధారాలు ఉన్నాయని అన్నారు. కార్‌మాండులో జరిగిన పార్టీ

-మిగతా 2 లో



## ఈఎస్ఐ దవాఖానల్లో
# వైద్యులు, మందుల కొరత

- సగం బయట కొనాల్సిందే..
- అన్ని మందులు అందుబాటులో లేవు
- సగం టాబ్లెట్ల కోసం ప్రైవేట్‌కు వెళ్లాల్సిందే..
- నిర్వహణ సరిగా లేక తగ్గుతున్న రోగులు
- వరుసగా మూతపడుతున్న డిస్పెన్సరీలు
- రూ.150 కోట్ల మేర ఔషధ బకాయిలు
- నిలిచిపోయిన మందుల సరఫరా
- బిల్లుల చెల్లింపును పట్టించుకోని ఈఎస్ఐ ఉన్నతాధికారులు
- ఈఎస్ఐ కార్డుదారులు, కుటుంబ సభ్యులు 72 లక్షల రోగులకు తప్పని ఇబ్బందులు

హైదరాబాద్,జులై 08 (నీలగిరి ఎక్స్ ప్రెస్)
రాష్ట్రంలో ఈఎస్ఐ ఆస్పత్రులు, డిస్పెన్సరీలకు వెళ్లడానికి రోగులు తటపటాయిస్తున్నారు. భారీగా ఓపీ పడిపోతుండడంతో డిస్పెన్సరీలు ఒక్కొక్కటిగా మూతపడుతున్నాయి. కొన్నింటిని దగ్గరిలో ఉన్న వాటిలో కలిపేస్తున్నారు. రాష్ట్రంలోని ఈఎస్ఐ ఆస్పత్రులకు సంబంధించి ఏడాదిగా ఔషధ సరఫరాదారులకు బిల్లులు చెల్లించడం లేదు. సుమారు రూ.150 కోట్లు పెండింగ్లో పడ్డాయి. వారు మందుల సరఫరా నిలిపివేశారు. ఈ ఆస్పత్రులపై ఆధారపడిన సుమారు 18 లక్షల మంది ఈఎస్ఐ ఐపీ కార్డు హోల్డర్లు, వారి కుటుంబ సభ్యులు కలిపి మొత్తం 72 లక్షల మంది ఇబ్బందిపడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 71 ఈఎస్ఐ డిస్పెన్సరీలు,

-మిగతా 2 లో




'నీలగిరి ఎక్స్ ప్రెస్" ప్రత్యేక కథనం

# ఢిల్లీలో సీఎం రేవంత్ బిజీ బిజీ

(మొదటి తరువాయి)

భేటీ అయరు. తెలంగాణ రాష్ట్ర అవసరాలకు కేటాయించిన యూరియాను సకాలంలో సరఫరా చేయాలని కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ మంత్రి జె.పి.నడ్డాకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రిని ఢిల్లీలోని ఆయన అధికారిక నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం కలిశారు. వానా కాలం సీజన్‌కు సంబంధించి ఏప్రిల్-జూన్ నెలల మధ్య 5 లక్షల మెట్రిక్ టన్నులకు గానూ కేవలం 3.07 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా చేశారని కేంద్ర మంత్రి దృష్టికి సీఎం తీసుకెళ్లారు. రాష్ట్రంలో ప్రాజెక్టులకు నీరు రావడం.. సాగు పనులు జోరుగా సాగుతున్నందున యూరియా సరఫరాలో ఆటంకాలు తలెత్తకుండా చూడాలని కోరారు. జులై నెలకు సంబంధించి 63 వేల మెట్రిక్ టన్నులు దేశీయంగా ఉత్పత్తి అయిన యూరియా, 97 వేల మెట్రిక్ టన్నుల విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న యూరియా రాష్ట్రానికి సరఫరా చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు కేవలం 29 వేల మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే చేశారని కేంద్ర మంత్రికి సీఎం తెలిపారు. దేశీయంగా ఉత్పత్తి అవుతున్న యూరియా కోటాను తెలంగాణకు పెంచాలని సీఎం కోరారు. యూరియా సరఫరాకు సంబంధించి రైల్వే శాఖ తగిన రేక్‌లు కేటాయించడం లేదని... వాటి సంఖ్య పెంచాలని విజ్ఞప్తి చేశారు. కేంద్రమంత్రితో సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ క్రీడా సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి, ఎంపీలు డాక్టర్ మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్‌దర్శి రఘునందన్‌రావు, కేంద్ర పథకాల సమన్వయ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్ తదితరులు పాల్గొన్నారు. అలాగే కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రాభివృద్ధికి సహాయ, సహకారాలు అందించాలని ఆయనకు సీఎం వినతి పత్రం అందజేశారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని జహీరాబాద్ ఇండస్ట్రీయల్ స్మార్ట్ సిటీ- అభివృద్ధికి సహకరించాలని కోరారు. అందులోభాగంగా జాతీయ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి, అమలు ట్రస్ట్ ఆమోదించిన రూ. 596. 61 కోట్లను త్వరగా విడుదల చేయాలని కేంద్ర మంత్రికి ఆయన విజ్ఞప్తి చేశారు. స్మార్ట్ సిటీకి అవసరమైన నీటి సరఫరా, విద్యుత్ తదితర మౌలిక సదుపాయాలకు ఆర్థిక సహాయం అందించాలని అడిగారు. హైదరాబాద్ - వరంగల్ పారిశ్రామిక కారిడార్‌లో భాగంగా వరంగల్ విమానాశ్రయానికి నిధులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని ఈ సందర్భంగా సీఎం రేవంత్ అభ్యర్థించారు. హైదరాబాద్ - బెంగళూరు ఏరో డిఫెన్స్ కారిడార్ మంజూరు చేయాలని కోరారు. అలాగే హైదరాబాద్ - విజయవాడ పారిశ్రామిక కారిడార్ ఫిజిబిలిటీని అధ్యయనం చేస్తున్నట్లు కేంద్ర మంత్రి దృష్టికి ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి తీసుకెళ్లారు. ఆదిభట్లలో అత్యుత్తమ మౌలిక సదుపాయాలతో ప్రత్యేక రక్షణ, ఏరోస్పేస్ పార్కును తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు- చేసిందని.. ఈ నేపథ్యంలో హైదరాబాద్ - బెంగళూరు పారిశ్రామిక కారిడార్‌ను ఏరో-డిఫెన్స్ కారిడార్‌గా మంజూరు చేయాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. పెట్టుబడులకు సిద్ధంగా ఉన్న వంద ప్లగ్ అండ్ ప్లే పారిశ్రామిక పార్కుల అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలు సమర్పిస్తామని.. వాటికి సైతం మోదీ ప్రభుత్వం మద్దతుగా నిలవాలని ఈ సందర్భంగా కేంద్ర మంత్రి పీయుష్ గోయెల్‌ను సీఎం రేవంత్ రెడ్డి కోరారు.

# కెటిఆర్ లెక్కలకు సమాధానం ఉంది

(మొదటి తరువాయి)

మంత్రులు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. రూ. లక్ష రుణమాఫీ విషయంలో మాజీ సిఎం కెసిఆర్ రెండుసార్లు మోసం చేశారని మండిపడ్డారు. తొలిసారి రుణమాఫీ పూర్తి చేసేందుకు ఐదేళ్ల సమయం తీసుకున్నారని విమర్శించారు. బిఆర్‌ఎస్ నేతలు పదేళ్లలో రూ.లక్ష కోట్లు- దోచుకున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రం వాళ్ల సొత్తు అన్నట్లు- కేసీఆర్ కుటుంబం వ్యవహరిస్తోందని సీఎం రేవంత్ రెడ్డి సలహాదారు, మాజీ ఎమ్మెల్యే వేం నరేందర్ రెడ్డి మండిపడ్డారు. 'తెలంగాణలో సంక్షేమ పనులు అభివృద్ధిని చూడలేని గత పాలకులు అవాకులు చెవాకులు పేలుతున్నారు. పేదలు తినే ప్రతి బుక్కలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం కనబడుతుంది. గత పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదు. 14వ తేదీన 40 లక్షల మందికి రేషన్ కార్డులు ఇస్తున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వం కష్టపడి పని చేస్తుంది. ప్రతీ కాంగ్రెస్ కార్యకర్త గర్వంగా గల్లా ఎగిరేసుకోవచ్చని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. మహబూబాబాద్ జిల్లాలో 'ప్రజాపాలన ప్రగతిబాట' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మున్సిపాలిటీ- కేంద్రంలో ప్రజాపాలన ప్రగతిబాట బహిరంగ సభలో మంత్రి సీతక్క మాట్లాడుతూ... 'డ్వాక్రా మహిళలకు 25 వేల కోట్ల రూపాయలు వడ్డీలేని రుణాలు అందజేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిది. మహబూబాబాద్ నగరంలో మహిళ శక్తి భవనాన్ని ఏర్పాటు- చేస్తున్నాం. మహిళల కోసం 500 రూపాయలకు గ్యాస్ ఇస్తున్నాం. మహిళల సంక్షేమం ఇందిరమ్మ రాజ్య లక్ష్యం. ఆడబిడ్డలు సంతోషంగా ఉంటే ఆ ఇళ్ళు, ఊరు బాగుంటు-ంది. పేదలు కరెంట్ బిల్లులు కట్టలేదని విద్యుత్ సరఫరా నిలిపివేసిన చరిత్ర గత బీఆర్ఎస్ ప్రభుత్వానిది. మా ప్రభుత్వం అదే పేదలకు ఉచిత విద్యుత్ ఇస్తుందని పేర్కొన్నారు. ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయి.

# మాట తప్పడం రేవంత్‌కు అలవాటే

(మొదటి తరువాయి)

ప్రెస్‌క్లబ్ వద్దకు వచ్చారు. ఆయన వెంట మాజీమంత్రులు, ఎమ్మెల్యేలు, కార్యకర్తలు భారీగా తరలి వచ్చారు. ఈ సందర్భంగా కెటిఆర్ మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ అరాచక పాలనలో రైతులు ఇబ్బంది పడుతున్నారు. దాదాపు 600 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలు అంటూ ప్రజలను మోసం చేశారు. బేసిన్ల నాలెడ్జ్, బేసిక్ నాలెడ్జ్ లేని సీఎం చర్చకు రావాలి. బహిరంగ చర్చకు రేవంత్‌రెడ్డి సవాలు విసిరితే మేం వచ్చాం. సవాలు విసిరిన సీఎం ఇక్కడకు ఎందుకు రాలేదు? సీఎం రాకపోతే మంత్రులైనా వస్తారని భావించాం. బహిరంగచర్చకు రావాలని సీఎంకు మరోసారి చెబుతున్నాం. కొత్త తేదీ, ప్రదేశం రేవంత్‌రెడ్డి చెబితే మేం తప్పకుండా వస్తాం. అసెంబ్లీలో చర్చించేందుకు కూడా మేం సిద్ధంగా ఉన్నాం. మైకులు కట్ చేయకుండా.. పూర్తిగా మాట్లాడే అవకాశం ఇస్తే అసెంబ్లీలో కూడా చర్చకు సిద్ధం అని కేటీఆర్ అన్నారు. 18 నెలలుగా రైతులను మోసం చేశారని ఆరోపించారు. ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క హామీని కూడా నిలబెట్టుకోకుండా రంకెలేస్తున్నారని మండిపడ్డారు. రేవంత్‌కు రచ్చ చేయడం తప్ప.. చర్చ చేయడం రాదని ఎద్దేవా చేశారు. రేవంత్ సవాల్‌ను స్వీకరిస్తే ఆయన చర్చకు రాలేదని, రేవంత్ మాట తప్పుతారని తెలిసినా సవాల్‌ను స్వీకరించామని కేటీఆర్ అన్నారు. తెలంగాణ నిధులు ఢిల్లీకి పోతున్నాయని, రైతులపై సీఎం రేవంత్ రెడ్డికి గౌరవం లేదని ఆరోపించారు. సీఎం ఢిల్లీకి ఎందుకు వెళ్లారని అడిగితే ఎరువుల బస్తాల కోసమని చెబుతున్నారని కేటీఆర్ తెలిపారు. ఎవరికి బస్తాలు మోస్తున్నారో తెలియంది కాదని అన్నారు. రైతుబంధు అందరికీ ఇచ్చేశామని చెప్పుకుంటున్నారని, కొడంగల్‌లో ఎంతమంది రైతులకు రైతుబంధు పడలేదో జాబితా సిద్ధంగా ఉందని చెప్పారు. రైతుల మరణాల జాబితా కూడా తీసుకొచ్చామని, ఆనాటి ఎమర్జెన్సీ పరిస్థితి ఇప్పుడు తెలంగాణలో కనిపిస్తోందని విమర్శించారు. ఇందిరమ్మ రాజ్యమంటే సంక్షేమ పాలన అందిస్తారని అనుకున్నామని అన్నారు. కానీ పోలీస్ పాలన నడుస్తోందన్నారు. గురుకులాల్లో విద్యార్థులు మరణిస్తున్నా పట్టింపు లేదన్నారు. చర్చ కోసం రేవంత్ ఇంటికి రమ్మన్నా వెళ్తామని చెప్పారు. రేవంత్ స్థాయికి కేసీఆర్ అవసరం లేదని, తాము చాలని అన్నారు. కాంగ్రెస్ నేతలకు నిజాయితీ ఉంటే చర్చకు రావాలని, లేదంటే క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి ముక్కు నేలకు రాసి కేసీఆర్‌కు క్షమాపణ చెప్పాలన్నారు. కేటీఆర్‌తో చర్చకు వచ్చే సత్తా లేనప్పుడు.. రేవంత్ రెడ్డి మరోసారి సవాల్ చేయొద్దని చెప్పారు. రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్ళింది యూరియా బస్తాల కోసం కాదని, ఏ బస్తాలు మోసి రేవంత్ ముఖ్యమంత్రి పదవిని కాపాడుకుంటున్నారో అందరికీ తెలుసని అన్నారు. రేవంత్ హయాంలో నీళు ్ళ ఆంధ్రకు.. నిధులు ఢిల్లీకి.. నియామకాలు రేవంత్ తొత్తులకు దక్కుతున్నాయని అన్నారు. గురువు చంద్రబాబు కోసం తెలంగాణ నీళ్ళను ఆంధ్రకు పంపుతున్నారని ఆరోపించారు. రేవంత్ మోసాలు చేసి నాలుగు రోజులు తప్పించుకోవచ్చని, కానీ ప్రజలు క్షమించరని కేటీఆర్ అన్నారు.

# ఈఎస్‌ఐ దవాఖానల్లో వైద్యులు, మందుల కొరత

(మొదటి తరువాయి)

4 ఆస్పత్రులు, 2 డయాగ్నస్టిక్స్ కేంద్రాలు ఉన్నాయి. ఎక్కువ మంది రోగులొచ్చే డిస్పెన్సరీల్లో ఐదుగురు చొప్పున, మిగతా వాటిలో ఇద్దరు చొప్పున వైద్యులు ఉన్నారు. డిస్పెన్సరీల్లో చాలా వరకు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. రెండు, మూడేళ్లుగా వాటికి అద్దెలు చెల్లించడం లేదు. కొన్నింటికి భవన యజమానులు తాళాలు వేశారు. ఇటీవలే ఏడుగురు యజమానులు తమ భవనాలను ఖాళీ చేయాలని ఈఎస్‌ఐకి నోటీసులు కూడా ఇచ్చారు. పలుచోట్ల డిస్పెన్సరీలను సరిగా నిర్వహించలేక సమీపంలోని ఈఎస్‌ఐ ఆస్పత్రులు, డిస్పెన్సరీల్లో కలిపేస్తున్నారు. అద్దె సరిగా చెల్లించకపోవడంతో హైదరాబాద్లోని తార్నాక డిస్పెన్సరీకి భవన యజమాని తాళం వేశారు. ఆ డిస్పెన్సరీని తాజాగా నాచారం ఆస్పత్రికి తరలించారు. జీడిమెట్ల-1, జీడిమెట్ల-2 డిస్పెన్సరీలను, సనత్నగర్లో రెండు డిస్పెన్సరీలను కలిపేశారు. ఇలా ఇప్పటివరకు సుమారు 20 డిస్పెన్సరీలను విలీనం చేశారు. మరోవైపు డిస్పెన్సరీల్లో 120 పైగా డాక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీనితో రోగులు ఇబ్బందిపడుతున్నారు.



**కనీస వైద్య పరీక్షలూ లేవు.!**

ఈఎస్‌ఐ ఆస్పత్రులు, డిస్పెన్సరీలకు వచ్చే రోగులకు వైద్యం, పరీక్షలు, ఔషధాలు ఉచితంగా అందాలి. అయితే వైద్య పరీక్షలకు అవసరమైన రసాయన పదార్థాల (రీఏజెంట్స్) కాంట్రాక్టు గడువు ముగియడంతో ఈ ఏడాది ఏప్రిల్ నుంచే సరఫరా నిలిచిపోయింది. కొత్తగా టెండర్లు పిలిచి రీఏజెంట్స్ సరఫరాకు చర్యలు తీసుకోవాల్సిన ఈఎస్‌ఐ ఉన్నతా అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. నాచారం వంటి కీలక ఈఎస్‌ఐ ఆస్పత్రిలో రీఏజెంట్స్ లేక మూత్ర పరీక్షలు నిలిచిపోయాయి. రక్త పరీక్షల్లోనూ కొన్ని రకాలే చేస్తున్నారు. దీంతో ఓపీ(ఔట్ పేషెంట్ల) సంఖ్య 40శాతానికి తగ్గినట్టు ఈఎస్‌ఐ వర్గాలు చెబుతున్నాయి. ఈఎస్‌ఐ రెండేళ్లుగా ఔషధ సరఫరా కంపెనీలకు సరిగా బిల్లులు చెల్లించడం లేదు. ఏడాది నుంచి రూపాయి ఇవ్వకపోవడంతో బకాయిలు రూ.150కోట్లకు చేరాయి. దీంతో ఆ సంస్థలు మందుల సరఫరా నిలిపివేశాయి. లోకల్ పర్చేజ్ కింద ఔషధాలను సరఫరా చేసే 'ట్వీన్ సిటీస్ మెడికల్ అసోసియేషన్స్' కూడా ఈఎస్‌ఐ ఆస్పత్రులకు మందులు సరఫరా చేయబోమని చెప్పాయి. ఈఎస్‌ఐ ఆస్పత్రుల నుంచి 5 లక్షల మంది మధుమేహ బాధితులు ప్రతీనెలా ఇన్సులిన్ ఇంజెక్షన్లు తీసుకెళు ్తంటారు. కొన్ని నెలలుగా వాటి సరఫరా నిలిచిపోవడంతో బయటే కొనుగోలు చేస్తున్నారు. పలు ముఖ్యమైన ఔషధాలు కూడా అందుబాటులో లేకుండాపోయాయి. కొత్తగా బాధ్యతలు తీసుకున్న కార్మికశాఖ మంత్రి వివేక్ ఈ దుస్థితిపై దృష్టిసారించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

# కేటీఆర్ డ్రామాలు కట్టిపెట్టాలి

(మొదటి తరువాయి)

తీసుకుని రావాలని సవాల్ విసిరారు. కేటీఆర్ స్థాయికి తగ్గట్లుగా మాట్లాడాలని.. చిల్లర చేష్టలు మానుకోవాలని హెచ్చరించారు. కేసీఆర్ లెటర్ ఇస్తే అసెంబ్లీ సమావేశాలు నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మాట ఇచ్చినట్లే ఏక కాలంలో రైతు రుణమాఫీ చేశామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే రైతు సంక్షేమ ప్రభుత్వమని చెప్పారు. కేటీఆర్‌వి చిల్లర ప్రయత్నాలు అని విమర్శించారు. కేటీఆర్‌ని చూస్తే జాలి వేస్తోందని ఎద్దేవా చేశారు. కేటీఆర్ చర్చించడానికి అసెంబ్లీ ఉందని గుర్తుచేశారు. కేసీఆర్ కంటే రేవంత్‌రెడ్డిది పెద్ద స్థాయి అని ఉద్ఘాటించారు. కేటీఆర్‌కి దమ్ముంటే కేసీఆర్‌ని అసెంబ్లీకి తీసుకురావాలని సవాల్ విసిరారు. తమకి అనుకూలంగా రాస్తే అందరి మీడియా, వ్యతిరేకంగా రాస్తే ఆంధ్రా మీడియానా అని ప్రశ్నించారు. ఆంధ్రజ్యోతి తెలంగాణ ఉద్యమానికి ఏం చేసిందో కేసీఆర్‌ని అడిగితే తెలుస్తోందని అద్దంకి దయాకర్ పేర్కొన్నారు. తెలంగాణ మీ జాగీరా?. సాగరహారం జరుగుతుంటే ఎక్కడ ఉన్నారు. సాగరహారం జరిగిన రోజుల్లో మీ మొహాలు ఎక్కడున్నాయి. తెలంగాణ ఉద్యమంలో కొట్లాడిన వాళ్లం మేము. సారా అమ్ముతారు జై తెలంగాణ అంటారు. ఫోన్ ట్యాపింగ్ చేస్తారు.. జై తెలంగాణ అంటారు. బీఆర్ఎస్ పేరు పెట్టుకున్నాక తెలంగాణతో మీకు సంబంధం ఏంటి?. నీ చెల్లి కవిత ఫోన్‌ని ట్యాపింగ్ చేసి అణగదొక్కావ్. మీ చెల్లి వేసిన ప్రశ్నలకు సమాధానం చెప్పే ధైర్యం ఉందా?. తెలంగాణ ప్రజలను మోసం చేసిన దొంగలు మీరు. రేవంత్‌రెడ్డితో పోలిక పెట్టుకోవడానికి అర్హతే లేదు మీకు. నమ్మించి మోసం చేయడమే మీ అయ్య సంస్కృతి. ఆంధ్రా తెలంగాణ అంటూ సెంటిమెంట్ రెచ్చగొడుతున్నారు. వాళ్లకి అనుకూలంగా ఉంటే మంచి మీడియానా? లేకపోతే చెడ్డ మీడియానా?. బీఆర్ఎస్ పార్టీని మీ నలుగురు తప్ప.. ఎవరూ సపోర్ట్ చేయడం లేదు. కేసీఆర్‌కి రావడం చేతకాక బచ్చగాడిని పంపుతారా. మాకు సానుభూతి ఉంది కాబట్టే హాస్పిటల్‌కి వెళ్లి కేసీఆర్‌ని పరామర్శిస్తున్నాం. బావ, బామ్మర్ధులతో పాటు చెల్లి ఇప్పుడు పోటీలోకి వచ్చింది. అందరూ కలిసినా రేవంత్‌ని ఏం చేయలేకపోయారు. పిచ్చిమాటలు మాట్లాడితే మా తడాఖా చూపిస్తాం. మొన్నటి ఎన్నికల్లో కేటీ-ఆర్ ఫోన్ ట్యాపింగ్ చేయకపోతే కాంగ్రెస్ పార్టీకి 100 సీట్లు- వచ్చేవి' అని అద్దంకి దయాకర్ ధీమా వ్యక్తం చేశారు.

## ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 35 శాతం రిజర్వేషన్లు

(మొదటి తరువాయి)

ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ కీలక ప్రకటన చేశారు. రాష్ట్రంలోని మహిళలకు ప్రభుత్వ ఉద్యోగాల్లో 35 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని ప్రకటించారు. ఈ మేరకు మంగళవారం ఉదయం కీలక ప్రకటన చేశారు. రాష్ట్రంలోని అన్ని రకాల ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థానిక మహిళలకు 35 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ప్రకటించారు. ఇక ఇప్పటికే రాష్ట్రంలోని మహిళలకు సామాజిక పెన్షన్‌ను నితీశ్ ప్రభుత్వం పెంచిన విషయం తెలిసిందే. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆ రాష్ట్రంలోని ఎన్డీఏ కూటమి సర్కారు పెన్షన్‌ల పెంపు నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం రూ.400గా ఉన్న పెన్షన్‌ను ఇప్పుడు రూ.1100 లకు పెంచారు. పెరిగిన పెన్షన్ జూలై నెల నుంచే అమలులోకి వచ్చింది. అర్హులందరి బ్యాంకు ఖాతాల్లో జూలై 10న పెన్షన్ డబ్బులు పడుతాయని తాను హామీ ఇస్తున్నానని గత నెల సీఎం ప్రకటించిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో మహిళలకు పెద్ద పీట వేస్తూ.. ఇప్పుడు ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లు ప్రకటించారు.

## రాముడి జన్మస్థలం నేపాల్

(మొదటి తరువాయి)

కార్యక్రమంలో ఓలి పాల్గొని ఈ వ్యాఖ్యలు చేశారు. శ్రీరాముడు నేపాల్‌లోనే జన్మించాడని ఓలి పునరుద్ఘాటించారు. వాల్మీకి రాసిన అసలైన రామాయణం ఆధారంగానే తాను ఈ మాట చెబుతున్నానని తెలిపారు. ఈవిషయం ప్రచారం చేయడానికి దేశ ప్రజలు ఏమాత్రం సంకోచించవద్దని పిలుపునిచ్చారు. రామ జన్మస్థలంపై ఎవరైనా వేరే కథలను ఎలా సృష్టించగలరని ప్రశ్నించారు. రాముడు పుట్టిన స్థలం నేపాల్‌లోనే ఉందని, అది ఇప్పటికీ అక్కడే ఉందన్నారు. దీన్ని తాము అంతగా ప్రచారం చేయలేకపోతున్నామని వ్యాఖ్యానించారు. అది కొందరిని బాధిస్తుందని తాను భావిస్తున్నానన్నారు. ఈసందర్భంగా ఆయన శివుడు, విశ్వామిత్రుడు కూడా తమ దేశంలోనే జన్మించారని పేర్కొన్నారు. ఇది తాను సొంతంగా చెబుతున్నది కాదని, వాల్మీకి రాసిన రామాయణంలోనే ఇది కూడా ఉందన్నారు. ఇక, గతంలోనూ ఓలి ఇలాంటి వివాదాస్పద ప్రకటనలే చేశారు. 2020లో అయోధ్య తమ దేశంలోని చిత్వాన్‌లోని థోరిలో ఉందని పేర్కొన్నారు. ఇక్కడే రాముడు పుట్టాడని ఆయన అన్నారు. అలాగే దశరథుడు పుత్రకామేష్ఠి యాగం చేసిన ప్రాంతం కూడా తమ దేశంలోనే ఉందన్నారు. అప్పట్లో ఓలి చేసిన ఈ వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ఈక్రమంలో నేపాల్ విదేశాంగ శాఖ ఓ ప్రకటనను విడుదల చేసింది. ఎవరి మనోభావాలు దెబ్బతీయడానికి ప్రధాని ఈ వ్యాఖ్యలు చేయలేదని స్పష్టం చేసింది. రాముడు జన్మస్థలంపై అనేక అభిప్రాయాలు ఉన్నాయని.. రామాయణంపై విస్తృతమైన సాంస్కృతిక, భౌగోళిక అధ్యయనం జరపాల్సిన అవసరం ఉందని మాత్రమే చెప్పారని తెలిపింది.

## ట్రంప్ మరో టారిఫ్ బాంబ్..

(మొదటి తరువాయి)



వాణిజ్య ఒప్పందాలు కుదరకపోతే పెరిగిన దిగుమతి సుంకాలను అమలు చేస్తామని హెచ్చరిస్తూ ఆయా దేశాలకు లేఖలు పంపినట్లు ట్రంప్ తెలిపారు. అమెరికాపై ప్రతీకార సుంకాలను విధించే దేశాలను ఉపేక్షించేది లేదన్నారు. జులై 9 డెడ్‌లైన్ ముగుస్తున్నందున, అమెరికాతో వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకోని దేశాలపై భారీ సుంకాల విధింపునకు సంబంధించిన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై ట్రంప్ సంతకం చేస్తారని వైట్‌హౌస్ ప్రెస్ సెక్రెటరీ కరోలైన్ లీవిట్ వెల్లడించారు.

# 2025 జూలై 9, బుధవారం తెలుగు పంచాంగం




మాసం -పక్షం
మాసం: ఆషాఢమాసం (అమాంత)
పక్షం: శుక్లపక్షం
తిథి
చతుర్దశి: జూలై 8, సాయంత్రం 7:12 నుండి
జూలై 9, సాయంత్రం 6:06 వరకు
పౌర్ణమి: జూలై 9, సాయంత్రం 6:06 నుండ
జూలై 10, సాయంత్రం 4:40 వరకు
నక్షత్రం
మూల: జూలై 8, ఉదయం 11:15 నుండి జూలై 9,
ఉదయం 10:09 వరకు
పూర్వాషాఢ: జూలై 9, ఉదయం 10:09 నుండి
జూలై 10, ఉదయం 9:05 వరకు
శుభ సమయాలు
బ్రహ్మ ముహూర్తం: ఉదయం 4:15- 5:02
అభిజిత్ ముహూర్తం: మధ్యాహ్నం 11:57 - 12:48
అశుభ సమయాలు
రాహుకాలం: మధ్యాహ్నం 12:18- 1:54
యమగండం: ఉదయం 7:28 - 9:03
దుర్ముహూర్తం: ఉదయం 11:00 - 11:52
వర్జ్యం: ఉదయం 8:04 - 9:52

# వైఎస్సార్ సేవలు చిరస్మరణీయమైనవి

- షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**షాద్‌నగర్, జూలై 8(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రజా సేవకు తన రాజకీయ జీవితాన్ని అంకితం చేసిన నిస్వార్థ, నిఖార్సైన నేతల్లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి గారు అగ్రగణ్యులని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మహానేత వైఎస్సార్ 76వ జయంతి సందర్భంగా పట్టణ చౌరస్తాలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కొంకళ్ళ చెన్నయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ – "మండుటెండలను లెక్కచేయకుండా రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేసి కాంగ్రెస్ పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకొచ్చిన ధీశాలి వైఎస్సార్. ఆయన పేరు వినగానే ముందుగా గుర్తుకు వచ్చేది పంచెకట్టే. తెలుగు సంప్రదాయానికి ఆయనకు అపారమైన గౌరవం, అభిమానం ఉండేది. రాజకీయాల్లోకి అడుగుపెట్టినప్పటి నుంచే పంచెకట్టును తన డ్రెస్ కోడ్‌గా మార్చుకున్నారు." పేద ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమించిన మహానేత వైఎస్సార్ సేవలు మరువలేనివని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ విశ్వం, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ బాబర్ అలీ ఖాన్, నేతలు రఘు నాయక్, కృష్ణ రెడ్డి, చెంది తిరుపతి రెడ్డి, జ్యుమద్ ఖాన్, ఇబ్రహీం, అందే మోహన్ ముదిరాజ్, వర్ష గౌడ్, కృష్ణ వేణి, మురళీమోహన్ (అప్పి), శ్రీనివాస్ యాదవ్, రఘుమా రెడ్డి, వెంకట్ కృష్ణ రెడ్డి, బాలరాజు గౌడ్, కొప్పునూరి ప్రవణ్, పులి మామడి రాజేష్ గౌడ్, మాధవులు, జయ ప్రకాష్, ఖదీర్, ముబారక్ అలీ ఖాన్, అందే శ్రీకాంత్, ప్రదీప్ ముదిరాజ్, సాయి కుమార్, మంగ అశోక్, కరుణాకర్, లింగారం యదయ్య, మహబూబ్, నెహ్రూ నాయక్, బాల గంగాధర్ తిలక్, ఇసాక్, రవి కుమార్, అన్వర్, శంకర్, లింగారెడ్డి గూడ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్సార్ జయంతి వేడుకల్లో పాల్గొన్న కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



**కూకట్‌పల్లి, జూలై 8(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మంగళవారం నాడు వైఎస్సార్ జయంతి సందర్భంగా కూకట్‌పల్లి కె.పి.హెచ్.బీ టెంపుల్ బస్టాప్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరంలో పలువురు యువకులు, కార్యకర్తలు పాల్గొని రక్తదానం చేశారు. ప్రజాసేవకు అంకితమైన వైఎస్సార్ సేవలను స్మరించుకుంటూ, ఆయన ఆశయాలను కొనసాగించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించామని నిర్వాహకులు తెలిపారు.

# సూరారం ఎక్స్ రోడ్లో ప్రమాదకర ట్రాన్స్ఫార్మర్ తొలగించాలి







- అధికారులకు వినతి పత్రం ఇచ్చిన స్థానికులు

**సూరారం, జూలై 8(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
సూరారం ఎక్స్ రోడ్లో ఉన్న ట్రాన్స్ఫార్మర్ రాకపోకలకు తీవ్ర ఆటంకంగా మారిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భారీ వాహనాలు, ఆర్టీసీ బస్సులు, స్కూల్ బస్సులు కాలనీలకు వెళ్తున్న సమయంలో ట్రాన్స్ఫార్మర్‌కు తగిలే ప్రమాదం ఉందని, ఇప్పటికే ఒకసారి తగిలినట్టు సమాచారం ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో జోనల్ కమిషనర్, సర్కిల్ కమిషనర్లకు వినతి పత్రం అందజేశారు. "ఇప్పటివరకు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా స్పందన లేకపోయింది. ఇకనైనా చర్య తీసుకోవాలి" అని స్థానికులు కోరారు. జోనల్ కమిషనర్ స్పందిస్తూ, "త్వరలో ట్రాన్స్ఫార్మర్‌ను తొలగిస్తాం" అని హామీ ఇచ్చినట్టు సమాచారం. బహుళ అంతస్తుల నిర్మాణం జరుగుతున్న జంట సర్కిల్లో సొంత స్థలం లేకుండా రోడ్లపై ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేయడం ప్రమాదకరం అని నివేదికలో పేర్కొన్నారు. భవిష్యత్తులో పైప్‌లైన్‌లు వేయాల్సి వస్తే రోడ్లు పగలగొట్టాల్సి వస్తుందని, మున్సిపల్ అనుమతి లేకుండా రోడ్లపై ట్రాన్స్ఫార్మర్‌లు ఏర్పాటు చేయకుండా జిహెచ్ఎంసి అధికారులు ఎలక్ట్రిక్ డిపార్ట్మెంట్‌కు నోటీసులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అలాగే, జోనల్ పరిధిలో నాణ్యతలేని ప్లాస్టిక్ ఉత్పత్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇస్తరాకులు మార్కెట్లోకి రాకుండా చూడాలని సూచించారు. దేవస్థానాల వద్ద ప్లాస్టిక్ కవర్లు ఇవ్వకుండా, పండుగ సందర్భంగా చెక్కులు పంపిణీ చేస్తున్న సందర్భంలో ప్రతి కమిటీ సభ్యునికి వివరంగా తెలియజేయాలని జోనల్ కమిషనర్‌కు మరో వినతి పత్రం అందజేశారు.

# ప్రతి ఒక్కరూ మధుమేహ పరీక్షలు చేయించుకోవాలి

- లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కే. గోవర్ధన్ రెడ్డి సూచన



**ఆమనగల్లు, జూలై 8(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
లయన్స్ క్లబ్ ఆమనగల్లు, పత్యానాయక్ సేవా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆమనగల్లు పత్య క్లినిక్లో ఏర్పాటు చేసిన మధుమేహ (షుగర్) పరీక్ష కేంద్రాన్ని క్లబ్ అధ్యక్షుడు లయన్ కే. గోవర్ధన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ – "ప్రతి ఒక్కరూ తప్పకుండా మధుమేహ పరీక్షలు చేయించుకోవాలి. లయన్స్ క్లబ్ ఉచితంగా నిర్వహించే ఈ శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే వృద్ధులు, యువకులు, మహిళలు ఎవరైనా సరే షుగర్ పరీక్షలు చేయించుకోవడం అత్యవసరం. షుగర్ అదుపులో ఉంటేనే ఆరోగ్యం సమతుల్యతతో ఉంటుంది" అని పేర్కొన్నారు. ఈ ఉచిత పరీక్ష శిబిరంలో 120 మందికి పరీక్షలు నిర్వహించగా, 70 మందికి మధుమేహం ఉన్నట్లు గుర్తించామని క్లబ్ పిఆర్ఓ పాషా తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా చైర్మన్ ఎం. చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు ఎంగలి బాలకృష్ణ, సంయుక్త కార్యదర్శి కొరివి వెంకటయ్య, క్లబ్ సభ్యులు ఉప్పల రాములు, పత్యా నాయక్, రామ్మోహన్, కర్నాటి కొండల్ రెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రమంత్రికి వినతి పత్రం అందజేసిన అందెల శ్రీరాములు

- అక్రమంగా నివసిస్తున్న రోహింగ్యాలపై చర్యలు తీసుకోవాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కి వినతి పత్రం అందజేసిన శ్రీరాములు అందెల



**బాలాపూర్,జూలై 8 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
రంగారెడ్డి జిల్లామహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండల్ లో అక్రమంగా నివసిస్తున్న రోహింగ్యాలపై గత కొన్ని నెలలుగా పోరాటం చేస్తున్న బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మహేశ్వరం నియోజకవర్గ ఇన్చార్జ్ అందెల శ్రీరాములు ఈరోజు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ని కరీంనగర్ లోని వారి కార్యాలయంలో కలిసి రోహింగ్యాలు అక్రమంగా పొందుతున్నటువంటి ప్రభుత్వ గుర్తింపు కార్డులు, వాహనాలు, డ్రైవింగ్ లైసెన్స్ లు, సిమ్ కార్డుల వివరాలను సాక్షాదారాలతో బండి సంజయ్ కి అందించి వారిపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేయడం జరిగింది. అందుకుగాను బండి సంజయ్ సానుకూలంగా స్పందించి రాష్ట్ర ప్రభుత్వం మరియు కేంద్ర ప్రభుత్వం చర్చించి వీలైనంత త్వరగా చర్యలు తీసుకునే విధంగా ప్రయత్నం చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మహేశ్వరం అసెంబ్లీ కన్వీనర్ దేవేందర్ రెడ్డి, తుక్కుగూడ మున్సిపాలిటీ మాజీ బిజెపి అధ్యక్షుడు రచ్చ లక్ష్మణ్, జిల్లా దిశా కమిటీ మెంబర్ అంబోజి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు భరోసా కోసం ఎమ్మెల్యే కు వినతి

- కొత్తపల్లి గ్రామ మాజీ ఉప సర్పంచ్ కావలి జగన్



**యాచారం,జూలై 08(నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
ఇబ్రహీంపట్నం నియోజకవర్గం శాసనసభ్యులు మల్రెడ్డి రంగారెడ్డి కొత్తపల్లి పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభోత్సవం సందర్భంగా వచ్చిన ఎమ్మెల్యే కు కొత్తపల్లి గ్రామంలో సర్వేనెంబర్ 32,178,182,222,242, వివిధ రైతుల పట్టా భూములకు రైతు భరోసా రావడం లేదు ఇట్టి భూమి లో అందరూ ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ నిరుపేదలు ఉన్నారని అన్నారు. అసైన్డ్ భూములకు పట్టా భూములకు అందరికి రైతు భరోసా కల్పించాలని కోరారు. అదేవిధంగా అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు . గ్రామంలో బస్తి దావకాన ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే ని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఎం గ్రామ శాఖ కార్యదర్శి పోలె శివ, శాఖ సభ్యులు శ్రీను, యాదయ్య, అని చంద్రయ్య, కృష్ణ,జంగయ్య, మొగులయ్య, రాములు పార్టీ నాయకులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కన్నెపల్లి మోటార్లతో నీటిని వినియోగించేందుకు అవకాశం..

- నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వం–మాజీ ఎమ్మెల్యే పుట్ట



**మంథని, జూలై 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
వర్షాభావ పరిస్థితుల్లో మహారాష్ట్ర నుంచి వస్తున్న వరద ప్రవాహాన్ని వినియోగించేందుకు కన్నెపల్లి మోటార్లు ఉన్నా, ప్రభుత్వం వాటిని నడపడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ మండిపడ్డారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని పంపుహౌజ్‌ను ఆయన పరిశీలించి, విలేకరులతో మాట్లాడారు. మేడిగడ్డ బ్యారేజ్‌లో గేట్లు వేసి నిల్వ చేయకుండానే, కన్నెపల్లి పంపుహౌజ్ నుంచి వరదనీటిని పైకి ఎత్తిపోసే అవకాశం ఉందని మధూకర్ వివరించారు. గోదావరి పరివాహక ప్రాంతాల్లో చెరువులు, కుంటలు, కాలువలు నీరు లేక ఎండిపోతున్నాయని, రైతులు వరినారులు సిద్ధం చేసుకోవడం కూడా సాధ్యం కాని స్థితికి చేరుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాజెక్టు నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే శ్రీధర్ బాబు నిర్లక్ష్యం చూపుతున్నారని ఆరోపించారు. గోదావరిలో ఉన్న నీటిని వినియోగిస్తే రాష్ట్రంలోని 15 జిల్లాలకు సాగునీరు అందించవచ్చని అభిప్రాయపడ్డారు. ఎప్పటికైనా ప్రభుత్వం స్పందించి మోటార్లు నడపకపోతే, పెద్ద ఎత్తున పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో నాయకుడు మోహన్ రెడ్డి సహా పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కొత్తపల్లి పాఠశాలలను సందర్శించిన రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు



**పెద్దపల్లి, జూలై 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కొత్తపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలను సందర్శించిన రాష్ట్ర మహిళా కమిషన్ మెంబర్ శ్రీమతి కటారి రేవతి రావు, విద్యా కమిటీ చైర్‌పర్సన్ రాజకుమారి సతీష్ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల శ్రమను కొనియాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నారని ప్రశంసించారు. పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి సహకారం అందిస్తానని హామీ ఇచ్చిన ఆమె, ప్రతి విద్యార్థిని ప్రభుత్వ పాఠశాలలో చేరదలచాలంటూ తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. తెనుగువాడ ఎస్సీ కాలనీ విద్యార్థులకు రవాణా సౌకర్యం లేక విద్యా కోసమే మూడు కిలోమీటర్ల దూరం నడిచి పాఠశాలకు చేరుతున్నారని పేరెంట్ కమిటీ వినతిపత్రం ద్వారా ఆవేదన తెలియజేసింది. ఈ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, యువ నాయకులు పాల్గొన్నారు.

### కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ మోటర్

# స్విచ్ ఆన్ చేసిన మంత్రి జూపల్లి



**నాగర్‌కర్నూల్, జూలై 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మహాత్మా గాంధీ –కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌లో భాగంగా ఎల్లూరు పంప్ హౌస్ వద్ద నీటి విడుదల కార్యక్రమాన్ని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మంగళవారం ప్రారంభించారు. మోటర్‌ను స్విచ్ ఆన్ చేసి సాగునీటి విడుదలకు శ్రీకారం చుట్టారు. ప్యాకేజీ 28, 29, 30 కింద ఉన్న ఎల్లూరు, సింగోటం, జొన్నల బోగుడ, గుడిపల్లి గట్టు జలాశయాలను నింపి ఆయకట్టు అవసరాలకు నీటిని అందించనున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై మంత్రి మండిపడి, 8 లక్షల కోట్ల అప్పులు చేసి కూడా ప్రాజెక్టుల నిర్మాణంపై నిర్లక్ష్యం వహించిందన్నారు. జిల్లాలో 4.60 లక్షల ఎకరాలకు ఆయకట్టు పెంచినట్టు కాగితాలపై ప్రకటించినా, మోటర్ల నిర్వహణ, కాలువల సామర్థ్యాలపై పనులు చేయలేదని ఆరోపించారు. 'కాంగ్రెస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో సాగునీటి ప్రాజెక్టులు ప్రాధాన్యతతో కొనసాగుతున్నాయి. చివరి ఆయకట్టుకు నీరు చేరే వరకు పోరాటం సాగుతుంది," అన్నారు మంత్రి జూపల్లి. బీఆర్ఎస్ నేతలు చేస్తున్న అసత్య ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, డా. రాజేష్ రెడ్డి, మేఘారెడ్డి, నీటిపారుదల శాఖ అధికారులు సీఈ విజయభాస్కర్ రెడ్డి, ఎస్ఈ సత్యనారాయణ రెడ్డి, ఈఈలు శ్రీనివాస్ రెడ్డి, మాణిక్ ప్రభు, చంద్రవేఖర్, మరళీ తదితరులు పాల్గొన్నారు.

# హనుమకొండ కాంగ్రెస్ భవన్‌లో వైఎస్సార్ జయంతి వేడుకలు



**హనుమకొండ, జూలై 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఉమ్మడి రాష్ట్ర దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి జయంతిని పురస్కరించుకుని హనుమకొండ కాంగ్రెస్ భవన్‌లో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి నివాళులు అర్పించారు. పార్టీ నేతలతో కలిసి వైఎస్ చిత్రపటానికి పూలమాలలు వేసి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆరోగ్యశ్రీ, రుణమాఫీ, ఉచిత విద్యుత్తు వంటి పథకాల ద్వారా వైఎస్ పేదలకు అండగా నిలిచారన్నారు. ఆయన పాలన నేతలకు మార్గదర్శకమని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శాకాంబరి ఉత్సవాల్లో భాగంగా భద్రకాళి ఆలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే నాయిని దంపతులు



**హనుమకొండ, జూలై 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హనుమకొండ భద్రకాళి దేవస్థానంలో మంగళవారం శాకాంబరి ఉత్సవాల్లో భాగంగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఆయన సతీమణి నాయిని నీలిమ అమ్మవారిని దర్శించుకున్నారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించగా, ఎమ్మెల్యే దంపతులు అమ్మవారి ఆశీర్వాదం పొందారు. తదుపరి ఆలయ అభివృద్ధి పనులు, మాడ వీధుల సౌకర్యాలు KUDA ఛైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డితో కలిసి పరిశీలించారు. అధికారులతో విస్తృతంగా చర్చించడంతో ఆలయ పరిసర వాతావరణానికి మరింత శుభ్రత, సౌందర్యం కలగనున్నది. శాకాంబరి అలంకరణను తిలకించేందుకు వరంగల్ సహా వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులకు ఎమ్మెల్యే దంపతులు సాదర స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ శేషు భారతి, ప్రధాన అర్చకుడు శేషు తదితరులు పాల్గొన్నారు.

# పాములపర్తిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ



**మర్కూక్, జూలై 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మర్కూక్ మండలంలోని పాములపర్తి గ్రామంలో మంగళవారం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు ఆంక్ష రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని కొబ్బరికాయ కొట్టి పూజ నిర్వహించారు. అనంతరం స్థానిక ప్రాథమిక పాఠశాలను సందర్శించి పరిస్థితులను గమనించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తిర్మల్ రెడ్డి, మండల అధ్యక్షుడు కనకయ్య గౌడ్, గ్రామ అధ్యక్షుడు క్రాంతికుమార్, కొండపోచమ్మ డైరెక్టర్ మాగి కిషన్, అలాగే కమిటీ సభ్యులు, కార్యకర్తలు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

# కూచారం కేజీబీవీ నిర్మాణ పనులపై పరిశీలన



**మనోహరాబాద్, జూలై 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కూచారం గ్రామంలోని కస్తూరీబా గాంధీ బాలికా విద్యాలయంలో నిర్మిస్తున్న అదనపు తరగతి గదుల పనులను మంగళవారం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్ రెడ్డి, అసిస్టెంట్ ఇంజనీర్ అరవింద్ గౌడ్ సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పనులను వేగవంతంగా కొనసాగిస్తూ దసరా నాటికి పూర్తి చేసి విద్యార్థుల వినియోగానికి అందుబాటులోకి తేవడమే లక్ష్యమన్నారు. పనుల్లో నాణ్యత విషయంలో రాజీ పడకుండా పూర్తిస్థాయిలో జాగ్రత్తలు తీసుకుంటామని తెలియజేశారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# హుజురాబాద్ డివిజన్ ఎస్సీ హాస్టల్స్‌లో ప్రవేశాలు ప్రారంభం



**హుజురాబాద్, జూలై 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
2025 –26 విద్యా సంవత్సరానికి హుజురాబాద్ డివిజన్ పరిధిలోని ఎస్సీ హాస్టల్స్‌లో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైంది. ఉచిత విద్య, ఆహారం, వస్త్రాలు, స్టడీ మెటీరియల్‌తో పాటు అన్ని సౌకర్యాలు కల్పిస్తారు. ప్రీమెట్రిక్ (తరగతి 3–10) హాస్టల్స్‌లో బాలురకు 572, బాలికలకు 375 సీట్లుబీ పోస్ట్‌మెట్రిక్ హాస్టల్స్‌లో బాలురకు 170, బాలికలకు 130 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ప్రతిభా అభివృద్ధి కోసం పదవ తరగతికి ప్రత్యేక కోచింగ్, సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడా సామగ్రి, విజ్ఞాన విహారయాత్రలు కల్పిస్తారు. రాగి జావ, పాలు, పండ్లు, చికెన్ తదితర భోజన వస్తువులు మెనూలో భాగం. దరఖాస్తుతో పాటు అవసరమైన ధృవపత్రాలు సమర్పించాల్సి ఉంది. వివరాలకు సహాయ సాంఘిక సంక్షేమ అధికారి ఎం. విజయ్ పాల్ రెడ్డి (ఫోన్: 93999 57766) ని సంప్రదించవచ్చు.

# ఇందిరమ్మ ఇండ్లతో పేదల సొంతింటి కల సాకారం

### ఎమ్మెల్యే విజయరమణ రావు



**ఎలిగేడు, జూలై 8(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం ముప్పిరితోట గ్రామంలో 57 లక్షల రూపాయల నిధులతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేసి, భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వాలు పేదలను పట్టించుకోలేదని, కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ఇండ్ల కల నెరవేరుతోందని పేర్కొన్నారు. అర్హులందరికీ ఇండ్లు మంజూరు చేయడంతో పాటు, తదుపరి దశలో కూడా ఈ ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు. రైతులకు గౌరవం, ప్రతి కుటుంబానికి సంక్షేమం అందించడమే లక్ష్యమని, రుణమాఫీ, ఉచిత కరెంట్, ఆర్టీసీ, గ్యాస్, ఆరోగ్యశ్రీ, సన్నబియ్యం, కొత్త రేషన్ కార్డులు వంటి పథకాలు అమలవుతున్నాయని వివరించారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనతో అభివృద్ధి పథాన్ని కొనసాగిస్తున్నట్టు చెప్పారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే మరిన్ని అభివృద్ధి సాధ్యమని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# దళిత బంధును అడ్డుకుంటూ దళితులను మోసం చేస్తున్న కాంగ్రెస్: బీజేపీ ఆరోపణ



**హుజురాబాద్, జూలై 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
దళిత బంధు రెండో విడత నిధులు విడుదల చేయకపోవడంపై హుజురాబాద్ ఆర్డీవో కార్యాలయం వద్ద బీజేపీ పట్టణ అధ్యక్షుడు తూర్పాటి రాజు నేతృత్వంలో వినతిపత్రం ఇచ్చి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దళితులను ఓటు బ్యాంకుగా వాడుకుంటూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కోసం డ్రామా ఆడుతుందని మండిపడ్డారు. కౌశిక్ రెడ్డి చేసిన తప్పిదాన్నే ఇప్పుడు కాంగ్రెస్ కొనసాగిస్తుందన్నారు. 2023 ఎన్నికల నోటిఫికేషన్ వల్ల అటకెక్కిన నిధులను ఎలాంటి షరతులు లేకుండా వెంటనే విడుదల చేయాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల బీజేపీ నేతలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# గాయత్రి క్షేత్రం వద్ద కారు ప్రమాదం

### యువకుడికి తీవ్ర గాయాలు

**గజ్వేల్ (జూలై 8: నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
గజ్వేల్ నియోజకవర్గంలోని కొండపాక మండల శివారులో గాయత్రి క్షేత్రం వద్ద రాత్రి ఓ కారు అదుపు తప్పి చెట్టును ఢీకొట్టిన ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో తిమ్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కనకయ్య, బాబు, స్వామిలకు స్వల్ప గాయాలు కాగా, అదే గ్రామానికి చెందిన గణేష్‌కు తీవ్ర గాయాలు కావడంతో వెంటనే మెరుగైన వైద్యం కోసం ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన సమయంలో కారు అధిక వేగంతో ఉన్నట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ప్రమాద స్థలానికి చేరుకున్న స్థానికులు గాయపడినవారికి ప్రాథమిక చికిత్స అందించి, ఆరోగ్య సేవలకు తీసుకెళ్లారు.



# ప్రతి ఇంటిలో రెండు మొక్కలైన నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలి



**మర్కూక్, జూలై 8(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
గజ్వేల్ నియోజకవర్గం మర్కూక్ మండలంలోని పాములపర్తి గ్రామంలో మాజీ సర్పంచ్ తిర్మల్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం వన మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఇంటిలో రెండు మొక్కలైన నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కనకయ్య గౌడ్, పద్మ నర్సింలు, కొండపోచమ్మ డైరెక్టర్ మాగి కిషన్, గ్రామ శాఖ అధ్యక్షుడు క్రాంతికుమార్, గ్రామ కార్యదర్శి ప్రవీణ్, లక్ష్మణ్, స్వామి, నాగరాజు, నరేష్ మరియు మహిళలు పాల్గొన్నారు.

# వయోవృద్ధుల కేంద్రం, ఆరోగ్య శిబిరాలను సందర్శించిన జిల్లా వైద్యాధికారి



**కరీంనగర్, జూలై 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ, పీఓఎంసిహెచ్ డాక్టర్ సనా జవేరియాతో కలిసి జెడ్పీ క్వార్టర్స్‌లోని వయోవృద్ధుల సంరక్షణ కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. కేంద్రంలో సేవలు తీసుకుంటున్న సీనియర్ సిటిజన్లతో మాట్లాడి, ఫిజియోథెరపీ సేవలపై ఫిజియోథెరపిస్ట్ కోటేశ్వర్ నుంచి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం సప్తగిరి కాలనీ పరిధిలోని గోదాం గడ్డ మునిసిపల్ కార్పొరేట్ ఆఫీసులో జరుగుతున్న సమగ్ర ఆరోగ్య శిబిరాన్ని (ఇంటిగ్రేటెడ్ హెల్త్ క్యాంప్) పరిశీలించారు. ఇందులో హెచ్ఐవి, సిఫిలిస్, క్షయవ్యాధి, షుగర్, అధిక రక్తపోటు, హెపటైటిస్-బి, హెపటైటిస్-సి, హిమోగ్లోబిన్ పరీక్షల నిర్వహణను సమీక్షించి, నిర్ధారణైన వ్యాధులకిగాను అందిస్తున్న మందులపై సమాచారాన్ని పొందారు. కార్యక్రమంలో వైద్యాధికారి డా. సనా జవేరియా, పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా. సాఫీర్ హుస్సేన్, డిపిఓ ఎన్‌హెచ్‌ఎం స్వామి, ఫిజియోథెరపిస్ట్ కోటేశ్వర్ సహా వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# బోనాల ఉత్సవాలకి మనోహరాబాద్ గ్రామంలో ఏర్పాట్లు



**మనోహరాబాద్ , జూలై 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
గజ్వేల్ నియోజకవర్గంలోని మర్కూక్ మండల కేంద్రంలో ప్రతి ఏడాది ఆషాఢ మాసంలో జరుగే బోనాల పండుగకు సంబంధించిన సమావేశం మంగళవారం పోచమ్మ ఆలయంలో నిర్వహించారు. గ్రామ పురోహితులు రామ శర్మ, కుల పెద్దల సమక్షంలో ఈ నెల 13వ తేదీ ఆదివారం బోనాల ఉత్సవాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నారు. పురాతన విశ్వాసాల నేపథ్యంలో జరగబోయే ఈ కార్యక్రమానికి గ్రామస్థులు ముందస్తు ఏర్పాట్లు ప్రారంభించారు. ప్రత్యేక పూజలు, ముగ్గులు, చీరల అలంకరణతో ఆలయానికి హంగు పెంచనున్నట్టు తెలుస్తోంది. ఈ సమావేశంలో సత్తి రెడ్డి, నర్సారెడ్డి, రమేష్ గౌడ్, పొట్టోల వెంకటేష్ గౌడ్, నిమ్మల యాదగిరి, సంద రవి, కృష్ణ గౌడ్, పాగల అజయ్, సింగం శ్రీకాంత్, చాకలి రవి, మల్లేష్, సంద యాదయ్య, ఎర్ర నర్సింలు, రావెల్లి కృష్ణ, నరేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# వెల్దండలో వివాహిత ఆత్మహత్య

**వెల్దండ,జూలై 8(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
వెల్దండ మండల కేంద్రంలో మంగళవారం తీవ్ర విషాదం నెలకొంది. స్థానికంగా నివసిస్తున్న అశ్విని (23) అనే వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు వెల్దండ పోలీసులు తెలిపారు. ఎస్సై కురుమూర్తి తెలిపిన వివరాల ప్రకారం, అశ్విని గత మూడేళ్ల క్రితం వెంకటయ్యతో వివాహం జరిగింది. మంగళవారం ఆయన ఇంట్లో లేని సమయంలో అశ్విని ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు తెలిపారు. ఆత్మహత్యకు కారణంగా కుటుంబ కలహాలే ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

# ఘనంగా వైఎస్ఆర్ జయంతి వేడుకలు



**కందుకూర్,జులై 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం కందుకూర్ మండల కేంద్రంలో...మహానాయకుడికి మా ఘన నివాళులు...ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి బొక్క జంగారెడ్డి మాజీ వైస్ ఎంపీపీ శమంత ప్రభాకర్ రెడ్డి మండల్ కోఆర్డినేటర్ అఫ్జల్ బేగ్. బీసీ సెల్ అధ్యక్షులు సరికొండ జగన్. మాజీ వార్డు సభ్యులు గుండ్ర సుధాకర్ రెడ్డి. సురసాని రాంరెడ్డి. మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ప్రశాంత్. పుష్ప దర్శన్. మాజీ ఎంపిటిసి సరికొండ పాండు. మండల్ మైనార్టీ సీనియర్ నాయకులు మోహిన్. మండల్ వైస్ ప్రెసిడెంట్ అజీజ్. సీనియర్ నాయకులు గోపాల్ రెడ్డి పాండురంగారెడ్డి, పాండు గౌడ్, వరికుప్పల బాబు, శ్రీనివాస్ గౌడ్,నవీన్ కుమార్ ఫయాజు,మోటెరమేష్,గ్రామ శాఖ అధ్యక్షులు పెరమల శేఖర్, గాదె కుమార్, యాదగిరి,పాముల కృష్ణ,ఎడ్ల కృష్ణ, జగదీష్ కురుమ. చిందం శ్రీకాంత్,నయ్యుము, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ సమితి
చెట్టు = అమ్మ
Reg No. 643/2025
Nurture Nature, Promote Wellness

## చెట్టు = అమ్మ, చెత్త = రోగం

చెట్టు మన జీవితానికి అమ్మంత ప్రాముఖ్యమైనది. అది మనకు ప్రాణవాయువును అందిస్తుంది, ప్రకృతిని సంరక్షిస్తుంది, మన శ్రేయస్సుకు తోడ్పడుతుంది. చెట్టు ఉంటే జీవితం ఉందని చెప్పడం అసత్యం కాదు. మరోవైపు, చెత్త అనేది రోగాలకు కారణమవుతుంది. చెత్త ఎక్కడైతే పేరుకుపోతుందో అక్కడ పర్యావరణం కలుషితమవుతుంది, నీరు, గాలి, నేల నాశనం అవుతాయి.

**చెట్టు ఎలా అమ్మలా ఉంటుంది:**
-మనకు ఆక్సిజన్ అందిస్తుంది.
-నీడ, చల్లదనం, ఆహారం, చెక్క, ఔషధాలు అందిస్తుంది.
-ప్రకృతి మనుగడలో కీలక పాత్ర పోషిస్తుంది.

**చెత్త ఎలా రోగంగా మారుతుంది:**
-చెత్త పేరుకుపోతే దోమలు, చీమలు, బ్యాక్టీరియా పుట్టుక.
-కాలుష్యం వల్ల శ్వాసకోశ, నీరు మరియు ఆహారానికి సంబంధించిన రోగాలు.

చెట్టు మన జీవితానికి అమ్మవంటిది. అందుకే మనం చెట్లను నాటాలి, వాటిని కాపాడాలి.
చెత్త మన జీవనానికి రోగం. అందుకే చెత్తను తగ్గించాలి, పునర్వినియోగం చేయాలి, పర్యావరణాన్ని స్వచ్ఛంగా ఉంచాలి.

"ప్రకృతిని ప్రేమిద్దాం, జీవనాన్ని కాపాడుకుందాం!"
మీ నరేష్ దండు సామాజిక కార్యకర్త

# శక్తికి రూపం దేశానికి దీపం!

**77 ఏళ్ల అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ప్రస్థానం**




దేశ నిర్మాణానికి పునాది పడింది విద్యార్థి శక్తి రూపంలో. జూలై 9, 1949న ప్రారంభమైన అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ABVP) ఉద్యమం నేడు 77వ సంవత్సరంలోకి అడుగుపెడుతోంది. స్వాతంత్ర్యానంతర కాలంలో దేశానికి అవసరమైనదేమిటంటే ు వ్యక్తి నిర్మాణం ద్వారా జాతీయ పునర్నిర్మాణం అనే స్పష్టమైన దిశానిర్దేశంతో ఇది ప్రారంభమైంది. విద్య, సంస్కారం, సమాజం, జాతీయత అనే నాలుగు మూల స్తంభాలపై ఈ పరిషత్ తన వాస్తవిక ప్రయాణాన్ని నిర్మించింది.

**దేశభక్తికి జీవమిచ్చిన ఉద్యమం**
విద్యార్థి సమస్యల పరిష్కారం కోసం మాత్రమే కాదు దేశాభివృద్ధికి, సమాజ శ్రేయస్సుకు, ధర్మ పరిరక్షణకు ఈ సంస్థ నిరంతరంగా పోరాటాలు సాగించింది.
1982లో బంగ్లాదేశ్ అక్రమ చొరబాటుదారులపై "చలో అస్సాం" ఉద్యమం, శ్రీనగర్ లాల్‌చౌక్ మీద జాతీయ పతాకాన్ని ఎగురవేసిన ఘట్టం,
2011లో దేశవ్యాప్తంగా అవినీతి వ్యతిరేక పోరాటం
□ ఇవన్నీ ABVP కలిసొచ్చిన ఘనతలు.

**తెలంగాణ ఉద్యమానికి దీపస్తంభం**
తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో ABVP పాత్ర అసాధారణం. "నా రక్తం □ నా తెలంగాణ" పేరుతో వేలాది మంది విద్యార్థుల రక్తదానం, "తెలంగాణ రణభేరి" పేరిట లక్షల మంది విద్యార్థులతో బహిరంగ సభలు, విద్యార్థి ఉద్యమాన్ని రాజకీయ లబ్ధికి వాడుకోని ఏకైక సంఘటనా రూపం
□ ABVP.

**త్యాగాల ధారలో స్ఫూర్తి రేఖ**
జాతీయ పతాకాన్ని ఎగురవేశాడనే కారణంతో కాకతీయ యూనివర్సిటీలో సామ జగన్మోహన్ రెడ్డి హత్య,
జగిత్యాలలో జితేందర్ రెడ్డి, ఉస్మానియా యూనివర్సిటీలో మేరెడ్డి చంద్రారెడ్డి తదితరుల ప్రాణత్యాగాలు ు
ఇవి దేశభక్తి కోసం విద్యార్థి పరిషత్ అందించిన ఉజ్వల ఆదర్శాలు.
టెర్రరిస్టులకు ఎదురైన విద్యార్థి శక్తికి నిదర్శనం.

**నాయకత్వ వికాసానికి వేదిక**
ఈ దేశంలో విద్యార్థి సంఘాలన్నీ రాజకీయ పార్టీల రెప్లిక్షన్లుగా మారిన కాలంలో, ఏబీవీపీ మాత్రం విద్యార్థి సమస్యల పైనే తన దృష్టిని కేంద్రీకరించింది.
ఇది ఒక 'పోస్ట్ హోల్డర్'ల సంఘం కాదు
ఇది 'విశ్వాసంతో ముందుకెళ్లే' కార్యకర్తల బలమై నిలుస్తోంది. పూర్తి సమయ కార్యకర్తలతో, విద్యా విశ్లేషకుల నేతృత్వంలో నడిచే ఒక ఉద్యమం ఇది.

**దేశవ్యాప్తంగా విద్యార్థి శక్తి స్ఫూర్తి**
కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు, అటాక్ నుంచి కటక్ వరకు □ విద్యార్థి సమస్య ఏది వచ్చినా, పరిషత్ అక్కడే నిలబడుతుంది. అందుకే, ఈ రోజు ఇది ప్రపంచంలోనే అతిపెద్ద విద్యార్థి సంఘంగా, 65 లక్షల మందికిపైగా సభ్యత్వంతో విశ్వవ్యాప్తాన్ని సాధించింది. 77వ దినోత్సవం ు విద్యార్థి దిశలో వికాసోత్సవం ఈ ఆవిర్భావ దినోత్సవం ఏబీవీపీకి మరొక మైలురాయి.
ఇది గతం గొప్పతనాన్ని గుర్తుచేసే వేళ, భవిష్యత్ బాటలో మరింత దృఢంగా సాగాల్సిన సంకల్పకాలం. దేశం కోసం విద్యార్థి శక్తిని చైతన్యంగా మార్చే దీక్షగల సంస్థ ఇది.

**జై విద్యార్థి శక్తి జై భారత్ మాతా!**

వ్యాసకర్త
హరీష్ సాగర్
ఎబివిపి విద్యార్థి నాయకులు



# నందిపేట్ లో ఘనంగా వైయస్సార్ జయంతి వేడుకలు..

**ఆర్మూర్,జూలై 08 జూలై 8(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఆర్మూర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి,జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆదేశాల మేరకు నందిపేట్ మండల కేంద్రంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దివంగత నేత డాక్టర్ వైయస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి,నివాళులు అర్పించి, కాంగ్రెస్ పార్టీ నందిపేట్ మండల అధ్యక్షులు మంద మహిపాల్ మాట్లాడుతూ.. రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తీసుకొచ్చిన పథకాలు ప్రజలకు ఎంతో మేలు చేశాయన్నారు.ఉచిత విద్య,ఉచిత వైద్యం,రైతులకు ఉచిత విద్యుత్,ఇందిరమ్మ ఇళ్లు,జల యజ్ఞం లాంటి పథకాలను అమలు చేసి ప్రజలకు మేలు చేశారని చెప్పారు.రాజశేఖర్ రెడ్డి లేకపోవడం,కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని ఆయన



అన్నారు.ఆయన ఆశయాలు ప్రతి కాంగ్రెస్ కార్యకర్త నెరవేర్చేలా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు




కరీంనగర్, జూలై 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
రాష్ట్ర విద్యారంగంలో సంచలనాత్మక మార్పులు తీసుకురావడంలో ప్రముఖ పాత్ర పోషించిన అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత, వివిఎన్‌ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, కాంగ్రెస్ పార్టీ నేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా మంగళవారం కరీంనగర్ జిల్లాలో వివిధ ప్రాంతాల్లో అభినందన కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. విద్యారంగంలో ఆయన చేసిన సేవలు, లక్షలాది విద్యార్థులకు అందించిన వెలుగైన భవిష్యత్ ఆయనను ప్రజల అభిమాన నేతగా నిలబెట్టాయని నేతలు పేర్కొన్నారు. "నరేందర్ రెడ్డి తెలంగాణ విద్యకు ఒక బ్రాండ్, అంకితభావానికి నిర్వచనం," అని అభిప్రాయపడ్డ వారు, భవిష్యత్తులో ఆయన సమాజానికి ఆదర్శనీయ ప్రజాప్రతినిధిగా ఎదుగుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. జన్మదినాన్ని పురస్కరించుకుని జిల్లా యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ కార్యక్రమం నిర్వహించి శుభాకాంక్షలు తెలుపగా, బీసీ సంక్షేమ సంఘం అంధుల పాఠశాలలో విద్యార్థులకు అన్నదానం, పండ్లు, చాక్లెట్లు పంపిణీ చేసింది. ఎన్ఎస్యూఐ నగర శివారులోని ఓమేగా క్యాన్సర్ హాస్పిటల్‌లో అన్నదాన సేవలు నిర్వహించింది. బీసీ విద్యార్థి సంఘం వీరబ్రహ్మేంద్ర వృద్ధాశ్రమంలో సేవా కార్యక్రమాలను చేపట్టింది. మహిళా కాంగ్రెస్ నేతృత్వంలో పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించగా, యువజన సంఘాలు హరితహారం కార్యక్రమాన్ని చేపట్టారు. నగరంలోని పలు కాలనీల్లోనూ ప్రజలు స్వతహాగా జన్మదినోత్సవాన్ని ఉత్సాహంగా జరిపారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య




## ● జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

మానకొండూరు, జూలై 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతోందని, ప్రైవేట్ పాఠశాలల నుంచి 35 మంది విద్యార్థులు లింగాపూర్ ఎంపీపీ ఉన్నత పాఠశాలలో చేరడం ఆ విశ్వాసానికి నిదర్శనమని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మంగళవారం నిర్వహించిన తల్లిదండ్రులు – ఉపాధ్యాయుల సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పిల్లల చదువు అభివృద్ధికి తల్లిదండ్రులు కచ్చితంగా సమావేశాలకు హాజరుకావాలని సూచించిన కలెక్టర్, ఐదవ తరగతిలోపు విద్యార్థులకు ప్రత్యేక శ్రద్ధ అవసరమని పేర్కొన్నారు. గ్రామంలోని అన్ని అంగన్వాడి చిన్నారులు ప్రభుత్వ పాఠశాలలో చేరడం, ఏడవ తరగతి విద్యార్థులంతా ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ప్రవేశించడం పట్ల ప్రశంసలు వెలువడాయి. పాఠశాలలో ఏర్పాటైన వాట్సాప్ గ్రూపులు, యూట్యూబ్ ఛానల్స్ ద్వారా తల్లిదండ్రులు విద్యా విధానాన్ని తెలుసుకునే అవకాశం ఉందని ఆమె వివరించారు. విద్యార్థులతో మమేకమయ్యిన కలెక్టర్, వారితో ప్రత్యక్షంగా చర్చించి, ప్రాయోగిక పరిజ్ఞానం తెలుసుకున్నారు.

**ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్**

తదనంతరం లింగాపూర్ గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను కలెక్టర్ పమేలా సత్పతి పరిశీలించారు. లబ్ధిదారులైన తాళ్ల భాగ్య కుటుంబంతో మాట్లాడి, నిర్మాణం వేగంగా పూర్తి చేయాలని సూచించారు. బేస్‌మెంట్ లెవెల్ పూర్తైన నేపథ్యంలో 1 లక్షను తక్షణమే జమ చేయాలంటూ ఎంపీడీవోకు ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో క్వాలిటీ కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి, ఎంఈఓ మధుసూదన్, తహసీల్దార్ విజయ్ కుమార్, ఎంపీడీవో వరలక్ష్మి, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ జియ్యంగార్, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్ఆర్ జయంతి సందర్భంగా మంత్రి జూపల్లి నివాళి



నాగర్‌కర్నూల్, జూలై 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డా. వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతిని పురస్కరించుకుని మంగళవారం కొల్లాపూర్ క్యాంప్ కార్యాలయంలో పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించిన ఆయన, "ప్రజా శ్రేయస్సు కోసం నిరంతరం శ్రమించిన మహానేత వైఎస్. ఆయన ఆశయాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తోంది" అని తెలిపారు. వైఎస్ఆర్‌తో తనకున్న అనుబంధాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, డా. రాజేష్ రెడ్డి, మేఘారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పాస్పోర్ట్ పోయింది ఓ అభాగ్యని ఆవేదన

ఎల్లారెడ్డిపేట ప్రతినిధిరాజన్న జూలై 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
ఎల్లారెడ్డిపేట మండలం బుగ్గ రాజేశ్వర తండా గ్రామం కు చెందిన ఎల్లారెడ్డిపేట మండలం ఇతనికి సంబంధించిన పాస్పోర్టు పోయినది దయచేసి ఎవరికైనా దొరికినచో ఇవ్వగలరు దీనిపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు దరఖాస్తు పెట్టి నాకు న్యాయం చేయాలని ఎస్పైని విన్నవించుకున్నారు నాకు తక్షణం వీసా రెడీగా ఉన్నందున పాస్పోర్టు ఇప్పించగలరని పోలీసు వారిని విన్నవించుకున్నారు

# ప్రగతినగర్‌లో వైఎస్సార్ జయంతి ఘనంగా



కుత్బుల్లాపూర్, జూలై 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతిని పురస్కరించుకుని కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని ప్రగతినగర్‌లో మంగళవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ఆయన విగ్రహానికి పూలమాల వేసి, కేక్ కట్ చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "వైద్య, విద్య, వ్యవసాయ రంగాల్లో శాశ్వతంగా ప్రజల హృదయాల్లో నిలిచిన నేత వైఎస్సార్. ఆయన ఆశయాలకు గౌరవంగా ఈ వేడుకలు నిర్వహిస్తున్నాం," అన్నారు. కార్యక్రమంలో 18వ డివిజన్ మాజీ కార్పొరేటర్ కొలన్ వీరేందర్ రెడ్డి, ఎన్ఎంసీ అధ్యక్షుడు కొలన్ రాజశేఖర్ రెడ్డి, జనరల్ సెక్రటరీ కొలన్ జీవన్ రెడ్డి, బ్లాక్ అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్ నేతలు, యువజన కాంగ్రెస్, ఐఎన్టియుసి ఎన్ఎస్యుఐ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# కంటి వైద్య శిబిరం సేవలను సద్వినియోగం చేసుకోండి

## ● సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి




కల్వకుర్తి, జూలై 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
కల్వకుర్తి పట్టణంలోని సీకేఆర్ ఫంక్షన్ హాల్‌లో ఐక్యత ఫౌండేషన్, శంకర నేత్రాలయ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరం నాలుగు రోజులుగా విజయవంతంగా కొనసాగుతోంది. చేయూతగా నిలిచిన టాస్క్- సీవోవో, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి శిబిరాన్ని సందర్శించి, "కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు%ా% వాటిని కాపాడుకోవడం మన బాధ్యత" అంటూ ప్రజలను ఉద్దేశించి సందేశం ఇచ్చారు. ఇప్పటి వరకూ దాదాపు 3000 మందికిపైగా శిబిరాన్ని సందర్శించగా, 2200 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 120 మందికి శుక్లాల సర్జరీల కోసం ఎంపిక చేయగా, 1300 మందికి పైగా ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. నాల్గవ రోజు 800 మంది వచ్చిన వారిలో 550 మందికి పరీక్షలు నిర్వహించగా, 28 మందికి సర్జరీలు విజయవంతంగా పూర్తయ్యాయి. ఆదివారం వరకు కొనసాగనున్న ఈ శిబిరాన్ని ఎక్కువమంది ప్రజలు విజ్ఞానపూర్వకంగా వినియోగించుకోవాలని నిర్వాహకులు ఆశిస్తున్నారు. ఈ కార్యక్రమంలో నరేందర్ గౌడ్, యూసఫ్ బాబా, గణేష్, యాదయ్య, రమేష్ నాయక్, శేఖర్, శ్రీపతి, నాగిళ్ల శివ, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

# బాచుపల్లి క్రాంతినగర్‌లో సీసీ రోడ్ పనులకు శంకుస్థాపన



కుత్బుల్లాపూర్, జూలై 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
బాచుపల్లి డివిజన్-1 పరిధిలోని క్రాంతినగర్ కాలనీలో పూర్తిగా పాడైన సీసీ రోడ్‌ను పునర్నిర్మించేందుకు మంగళవారం శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కాలనీ వాసుల విజ్ఞప్తిపై స్పందించిన నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి, కార్పొరేషన్ ఫండ్స్ ద్వారా రోడ్డు నిర్మాణానికి మంజూరును తీసుకురావడమే కాకుండా, ముఖ్య అతిథిగా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం బస్తీ వాసులు ఆయనకు శాలువా కప్పి సత్కరించి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఆయన చూపిస్తున్న చురుకుదనం ప్రశంసనీయం అని స్థానికులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో 18వ డివిజన్ మాజీ కార్పొరేటర్ కొలన్ వీరేందర్ రెడ్డి, ఎన్ఎంసి అధ్యక్షుడు కొలన్ రాజశేఖర్ రెడ్డి, జనరల్ సెక్రటరీ కొలన్ జీవన్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు రాజి రెడ్డి, జీవి రెడ్డి, నవీన్, ప్రభాకర్, బుగ్గ రెడ్డి, రాజసుర్, శ్రీధర్, సురేష్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్సార్ సేవలు మరువలేనివి

## ● దేప భాస్కర్ రెడ్డి



బాలాపూర్,జులై 8 (నీలగిరి ఎక్స్ ప్రెస్):
రంగారెడ్డి జిల్లామహేశ్వరం నియోజకవర్గం రామకృష్ణాపురం డివిజన్ చిత్రలేఅవుట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దివంగత ముఖ్యమంత్రి డా.వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు అర్పించి ఘనంగా నివాళులు సమర్పించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దేప భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ:-ప్రజాసేవకు తన జీవితాన్ని అంకితం చేసిన నిస్వార్థ నేతల్లో వైఎస్సార్ అగ్రగణ్యులు.మండు వేసవికైనా లెక్కచేయకుండా పాదయాత్ర చేసి రాష్ట్రానికి అభివృద్ధిని,కాంగ్రెస్ పార్టీకి తిరిగి అధికారాన్ని తీసుకొచ్చారు.ఆయన పేరు గుర్తుకు రాగానే మనకెదురవ్వేది పంచెకట్టు,అది ఆయన తెలుగు సంప్రదాయాల పట్ల ఉన్న గౌరవానికి నిలువెత్తు చిహ్నం.రాజకీయాల్లోకి అడుగుపెట్టినప్పటి నుంచీ పంచెకట్టును తన దైన డ్రెస్ కోడ్‌గా మార్చుకున్నారు.పేదల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమించిన నేత ఆయన,అని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## నగునూరులో తల్లిదండ్రుల సమావేశం ప్రభుత్వ పాఠశాలపై విశ్వాసం మరింత బలపడుతోంది

- నిష్ణాత ఉపాధ్యాయ బృందం, ఆధునిక సదుపాయాలపై ప్రశంసలు
- -బాసర ట్రిపుల్ ఐఐటీ లక్ష్యంగా పాఠశాల అభివృద్ధి కార్యక్రమాలు




కరీంనగర్, జూలై 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)

కరీంనగర్ రూరల్ మండలంలోని నగునూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సమావేశం ఘనంగా నిర్వహించబడింది. ఈ సమావేశానికి విద్యార్థుల తల్లిదండ్రులు అత్యధిక సంఖ్యలో హాజరై తమ అభిప్రాయాలను పంచుకున్నారు. మండల విద్యాధికారి మాట్లాడుతూ, "ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు ఎంతో మెరుగ్గా ఉన్నాయి. నిష్ణాతులైన ఉపాధ్యాయులు అంకితభావంతో విద్యార్థుల భవిష్యత్తును నిర్మిస్తున్నారు" అని అన్నారు. నగునూరు పాఠశాలలో అటల్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్, ఐసిటి ల్యాబ్ వంటి ఆధునిక వసతులు ఉన్నట్లు వివరించారు. తల్లిదండ్రులు మాట్లాడుతూ, "ప్రధానోపాధ్యాయులు విద్యార్థులపై వ్యక్తిగత శ్రద్ధ చూపుతున్నారు. ఈసారి బాసర ట్రిపుల్ ఐఐటీలో సీటు దక్కేలా మరింత శ్రద్ధ తీసుకోవాలి" అని ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యార్థులు క్రీడా రంగంలోనూ మంచి ప్రతిభ చూపుతుండటం సంతోషకరమని అభిప్రాయపడ్డారు. పాఠశాల అభివృద్ధికి అనేక ప్రణాళికలు రూపొందించామని, కనీస అభ్యసన స్థాయిలకు అనుగుణంగా గుణాత్మక విద్యను అందిస్తామని ప్రధానోపాధ్యాయులు తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లు, స్నేహిత కార్యక్రమాలు వంటి శిక్షణలను నిరంతరం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అతిపెద్ద హాజరు నమోదైనందుకు తల్లిదండ్రులపై మండల విద్యాధికారి ప్రశంసలు కురిపించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

## లిల్లీపూర్ గ్రామంలో వైఎస్సార్ జయంతి వేడుకల్లో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ యాదయ్య



మహేశ్వరం,జులై 8 (నీలగిరి ఎక్స్ ప్రెస్):

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండలం లిల్లీపూర్ గ్రామంలో దివంగత ముఖ్యమంత్రి డా.వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతిని పురస్కరించుకొని ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా డా.వైఎస్సార్ కి దుబ్బచెర్ల గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అల్లం బాల్ రెడ్డి ఘన నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ యాదయ్య,విజయ్ రెడ్డి, సంజీవరెడ్డి,సుధాకర్,రాజు,మండల యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ గొల్లూరి రాజు,బొల్లు కుమార్ యాదవ్,పాపయ్య మరియు అనేక మంది కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## శారద ఒకేషనల్ జూనియర్ కాలేజ్ ని సందర్శించిన టీఎస్ఎస్ఓ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చిక్కిరి శ్రీకాంత్





మహేశ్వరం,జులై 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం మహేశ్వరం మండల కేంద్రంలో.. టీఎస్ఎస్ఓ రాష్ట్ర అధ్యక్షులు, వ్యవస్థాపకులు, ఆదేశాల మేరకు ఉన్నటువంటి శ్రీ శారద ఒకేషనల్ జూనియర్ కాలేజ్ నీ సందర్శించిన.. టి ఎస్ ఎస్ ఓ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చిక్కిరి శ్రీకాంత్ సందర్శించి. విద్యార్థిని విద్యార్థులతో ల్యాబ్ టెక్నీషియన్స్, నర్సింగ్ కోర్స్, కంప్యూటర్ మరియు సైన్స్, ఏ విధంగా నడుస్తున్నాయని విద్యార్థులను అడిగి తెలుసుకోవడం జరిగింది శ్రీ శారద ఒకేషనల్ జూనియర్ కాలేజ్ , కరస్పాండెంట్ :- పి శివకుమార్ మొట్టమొదటిసారిగా కాలేజీకి విచ్చేసిన సందర్భంగా.. విద్యార్థులతో పాటు పి శివకుమార్ చిక్కిరి శ్రీకాంత్ ని ఘనంగా సన్మానించడం జరిగింది.

# గ్రామాభివృద్ధి దిశగా వేగంగా అడుగులుపెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణ

పెద్దపల్లి, జూలై 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)

సుల్తానాబాద్ మండలంలోని కందునూరిపల్లి, నారాయణపూర్, కొదురుపాక, దేవునిపల్లి గ్రామాల్లో మంగళవారం స్థానిక అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు, ఇందిరమ్మ ఇండ్ల పట్టాలను లబ్ధిదారులకు అందజేశారు. ముగ్గులు వేసి భూమిపూజ చేయడం ద్వారా నిర్మాణ కార్యకలాపాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ప్రతి గ్రామంలో నిరుపేదలకు ఇంటిని అందిస్తే, వారి ముఖాల్లో వెలుగు కనిపిస్తుందని భావించి ప్రతి ఇల్లు %-% ప్రతి సమస్యపై కార్యాచరణ చేపట్టుతున్నాం," అని తెలిపారు. కందునూరిపల్లి గ్రామానికి 56 లక్షల విలువైన సీసీ రోడ్లు, డ్రైనేజీలు, నారాయణపూర్‌కు 37.50 లక్షల విలువైన రోడ్లు, డ్రైనేజీలు, 25 ఇండ్ల



మంజూర్లు, కొదురుపాకలో 26 లక్షలతో హెల్త్ సెంటర్, దేవునిపల్లిలో 25 లక్షలతో కమ్యూనిటీ హాల్, బోర్ వెల్ నిర్మాణాలు ప్రారంభించినట్లు వివరించారు. రైతులకు సాగునీటిని అందించడమే లక్ష్యమని, 31 కోట్ల రూపాయల బోనస్‌ను అందించిన ఘనత తమదేనని ఆయన వివరించారు. "200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్, 500కే గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు, సన్నవడ్లకు బోనస్, రైతులకు భరోసాఇవి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే సంక్షేమ చర్యలు" అని పేర్కొన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం, దళిత కాలనీలను చీకటిమయం చేసిన అన్యాయ పాలనను ఎదుర్కొని ప్రజా ప్రభుత్వం సత్వరాభివృద్ధి సాధిస్తోందని అన్నారు. ప్రజల హక్కులు, హామీలు అమలవుతున్నాయన్న నమ్మకం కల్పించారు. తదుపరి నారాయణపూర్ గ్రామంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే, వైఎస్సార్ సేవలను స్మరించుకుని కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, పంచాయతీరాజ్ ఏఈ, మార్కెట్ కమిటీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ నేతలు, వైద్యాధికారులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పౌల్ట్రీ ఫారంలో మైనర్ బాలికలు గుర్తింపుఆపరేషన్ ముస్కాన్ కింద చర్యలు




మాడుగుల,జూలై 8(నీలగిరి ఎక్స్‌ప్రెస్)

: మాడుగుల మండలంలోని నల్లచెరువు శివారులో గల వెంకట శివ పౌల్ట్రీ ఫారంలో మంగళవారం సాయంత్రం పోలీసులు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఈ దాడిలో, బాల కార్మికులుగా పనిచేస్తున్న ఇద్దరు మైనర్ బాలికలను గుర్తించి అక్కడి నుండి రక్షించారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నట్టు మాడుగుల పోలీస్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. మైనర్ బాలికలు వ్యావహారికంగా ఉపాధికి దూరంగా ఉండే వయస్సులో ఇలా పనిచేస్తుండడం పట్ల అధికారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు పోలీసులు పసిగట్టిన వివరాలను సేకరిస్తున్నారు.

## వైయస్ రాజశేఖర్ రెడ్డి కి నివాళులర్పించిన పారిజాత నరసింహారెడ్డి



జెల్ పల్లి ,జులై 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం జెల్ పల్లి లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 76 వ జయంతి సందర్భంగా బడంగ్ పేట్ మున్సిపల్ పరిధిలోని అల్మాస్ గూడ వైఎస్ఆర్ పార్క్ వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు బోయపల్లి రాఘవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి పలువురు కాంగ్రెస్ నాయకులతో కలిసి హాజరై డాక్టర్ వైయస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దివంగత డాక్టర్ వైయస్ఆర్ అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి రాష్ట్ర ప్రజల గుండెల్లో నిలిచిపోయారని కొనియాడారు. 108, ఆరోగ్య శ్రీ లాంటి ఎన్నో పథకాల రూపకల్పన చేసి పేద ప్రజలకు సేవ చేసిన ఘనత ఆ మహనీయుడు డా. వైఎస్ఆర్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్స్ అమలు చేయాల్సిందే.

- రాజ్యసభ సభ్యులు వద్దిరాజు...

హైదరాబాద్,జూలై 8(నీలగిరి ఎక్స్ ప్రెస్):

బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించిన తర్వాతనే స్థానిక సంస్థలకు ఎన్నికలు జరిపించాలని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కామారెడ్డి బహిరంగ సభలో, ఎన్నికల ప్రచారంలో, మేనిఫెస్టోలో బీసీలకిచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో, విద్యా, ఉద్యోగ రంగాలలో 42% రిజర్వేషన్స్ అమలునకు పార్లమెంట్ ద్వారా చట్టబద్ధత కల్పించాల్సిందేనని స్పష్టం చేశారు. అప్పటి తమిళనాడు ముఖ్యమంత్రి జయలలిత, ఆ రాష్ట్రానికి చెందిన అన్ని పార్టీల నాయకులు ఐకమత్యంతో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి 69% రిజర్వేషన్స్ అమలునకు పార్లమెంట్ ద్వారా చట్టం చేయించుకోవడాన్ని ఎంపీ రవిచంద్ర గుర్తు చేశారు.అదే మాదిరిగా తెలంగాణలో కూడా రిజర్వేషన్స్ అమలునకు బాధ్యతగల ప్రతిపక్షంగా తమ పార్టీ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటం కొనసాగిస్తుందన్నారు. కాంగ్రెస్ పాలకులు, నాయకత్వంపై మరింత వత్తిడి పెంచుతూనే




ఉంటామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి లోకసభలో 100 మంది సభ్యులు ఉన్నారని, ఇండియా కూటమి ఏంపీలతో కలిసి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడిని తీవ్రతరం చేసి బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో, విద్యా, ఉద్యోగ రంగాలలో 42% రిజర్వేషన్స్ కోసం పార్లమెంటులో బిల్లు ప్రవేశపెడితే తమ నాయకుడు కల్వకుంట్ల చంద్రశేఖర రావు మార్గ నిర్దేశనంలో సంపూర్ణ మద్దతునిస్తామని ఎంపీ వద్దిరాజు చెప్పారు.కాంగ్రెస్ బీసీలకు అన్ని రంగాలలో తీరని అన్యాయం జరుగుతున్నదని ఆవేదన వ్యక్తంచేశారు.జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు మంత్రిమండలిలో కేవలం మూడంటే మూడు పదవులు మాత్రమే ఇవ్వడం తీవ్ర విచారకరమన్నారు. మున్నూరుకాపు, యాదవ, ముస్లిం, లంబాడీ, కురుమ, చాకలి కులాల వారికి మంత్రివర్గంలో చోటివ్వకపోవడం పట్ల నిరసన వ్యక్తం చేస్తూ పాలకులను గట్టిగా నిలదీయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. జనాభా దమాషా ప్రకారం చూస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు 12 మంత్రి పదవులు ఇవ్వాల్సి ఉండే అన్నారు. కామారెడ్డి డిక్లరేషన్, బూటకపు హామీలు, కల్లబొల్లి కబుర్లు చెప్పి అధికారంలోకి వచ్చాక, వాటిని నెరవేర్చలేక "డైవర్షన్ పాలిటిక్స్"చేస్తున్నారని ఎంపీ వద్దిరాజు కాంగ్రెస్ పాలకులపై మండిపడ్డారు.బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పిస్తూ స్థానిక సంస్థల ఎన్నికలు జరిపించాలని, ఇందుకోసం కాంగ్రెస్ పాలకులు కేంద్ర ప్రభుత్వంపై మరింత వత్తిడి పెంచాలని ఎంపీ రవిచంద్ర డిమాండ్ చేశారు.స్థానిక సంస్థల ఎన్నికలు, విద్యా, ఉద్యోగ రంగాలలో 42% రిజర్వేషన్స్ సాధించుకునేందుకు ఇదే సరైన సమయమని, ఇందుకు బీసీ కులాల వారందరం కూడా మరింత ఐక్యతతో పోరాడుదామన్నారు.స్వాతంత్ర్యం సిద్ధించి 80 ఏండ్లు సమీపిస్తున్నా కూడా కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ లేకపోవడం బాధాకరమని ఎంపీ వద్దిరాజు వ్యాఖ్యానించారు.

# మృతుడికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించిన

- సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మాజీ మంత్రివర్యులు

పెద్దమందడి జూలై 8(నీలగిరి ఎక్స్ ప్రెస్):

పెద్దమందడి మండలం, పామిరెడ్డిపల్లి తండా కు, చెందిన కీ"శే" మేఘవత్ రాములు నాయక్, నిన్న ఆకస్మికంగా మరణించడం జరిగింది. ఇట్టి విషయం తెలుసుకొని నేడు వారి నివాసానికి వెళ్లి భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళు లు అర్పించి వారి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి, మనో ధైర్యాని కల్పించిన మాజీ మంత్రి వర్యులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి. మాజీ మంత్రి గారి వెంట మాజీ ఎంపీపీ కృష్ణ నాయక్, పిణ్య



నాయక్, మన్యపు రెడ్డి, చికరు చెట్టు తాండ ఉపసర్పంచ్ రమేష్, ముందర తాండ రమేష్, చిన్న, గోవింద్ ,రమేష్ నాయక్, మాన్యం గౌడ్, తదితరులు పాలుగోన్నారు.

# కాంగ్రెస్‌ను సంస్థాగతంగా బలోపేతం చేద్దాం

**•-కప్పాటి పాండురంగా రెడ్డి**



మహేశ్వరం,జులై 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడ కాంగ్రెస్ పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడమే ముఖ్యలక్ష్యంగా ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని తుక్కుగూడ మున్సిపాలిటీ సంస్థాగత ఎన్నికల సమన్వయకర్త, రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ కప్పాటి పాండురంగా రెడ్డి అన్నారు.మంగళవారం తుక్కుగూడ మున్సిపాలిటీ కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కెవిఆర్ ఆదేశాల మేరకు మహిళలు, యువతకు పార్టీలో సముచిత ప్రాధాన్యత కల్పిస్తూ,వార్డు కమిటీలు,అనుబంధ విభాగాలు,ఇందిరమ్మ కమిటీలు వంటి శ్రేణుల నియామకాన్ని వేగంగా పూర్తి చేయాలని సూచించారు.పార్టీ కోసం శ్రమించిన వారికి ప్రాధాన్యత ఇస్తామని,వారికి గుర్తింపు లభిస్తుందని భరోసా ఇచ్చారు.గత ప్రభుత్వంలో చోటుచేసుకున్న ఆర్థిక విధ్వంసం,అవినీతి,ప్రజా ధన దోపిడీ వంటి అంశాలను బహిరంగపరచడమే కాకుండా,కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు ప్రజలకు చక్కగా తెలియజేసే బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు.ముఖ్యంగా గడపగడపకు కాంగ్రెస్ సంక్షేమ పథకాలను వివరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ముఖ్య పథకాలు:మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం,ఆరోగ్యశ్రీ సేవలు రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంపు,ఇందిరమ్మ ఇళ్ల మంజూరు,రేషన్ కార్డుల పంపిణీ,200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్,రూ. 500కే వంట గ్యాస్,రైతుల రుణమాఫీ,రైతు భరోసా,బీసీ కుల గణన,ఎస్సీ వర్గీకరణ, ఉద్యోగాల భర్తీకి టీఎస్‌పీఎస్సీద్వారా నోటిఫికేషన్లు, మహిళా సంఘాల కోసం ప్రత్యేక తోడ్పాటులు,ఈ సమావేశంలో మున్సిపాలిటీ మాజీ వైస్‌ఛైర్మన్ భవాని వెంకట్ రెడ్డి,రాష్ట్ర నాయకులు జానకిరాం, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు శివగల్ల,యాదయ్య,బోద పాండురంగా రెడ్డి,కోటగల్ల రాజ్ కుమార్,నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు సమంతా,బాస్కర్ రెడ్డి,ఎలగొండి పద్మ,మాజీ కౌన్సిలర్ కొండల్ యాదవ్,నాగిల్ల శేఖర్, శేకర్ రెడ్డి, శ్రీదర్ గౌడ్,మజర్ బాయి,అబ్దుల్ రహూప్, రవికుమార్,పైజల్ ఖాద్రీ,కప్పల రాజ్,అస్మా, అనీస్, నసీమ్,షెహానాజ్, సారా,బాదర్ ఉన్నీస,షకీర, హాసీయ,ఫరీదా,కతీజ,అమ్జద్,నవీన్ గౌడ్,నియాజ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# ఆలయ భూముల ఆక్రమణను అడ్డుకుంటే దాడి చేయడం హేయమైన చర్య

**-జేఏసీ ఛైర్మన్ వి.లచ్చిరెడ్డి**
**-భద్రాద్రి ఈవో రమాదేవిపై దాడిని ఖండించిన ఉద్యోగుల జేఏసీలి**
**-దాడికి పాల్పడిన వారిపై చర్యలకు డీసీఏ, టీజీటీఏ, టీజీఆర్ఎస్ఏ డిమాండ్...**



హైదరాబాద్, జూలై 8(నీలగిరి ఎక్స్‌ప్రెస్): భద్రాద్రి రామాలయ భూములు పురుషోత్తపట్నం (ఏపీ)లో కబ్జాకు గురవుతుండగా అడ్డుకున్న ఈవో రమాదేవిపై జరిగిన దాడిని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్, డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.లచ్చిరెడ్డి తీవ్రంగా ఖండించారు. దాడికి పాల్పడిన నింధితులను గుర్తించి వెంటనే అరెస్టు చేసి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈవో రమాదేవిపై జరిగిన దాడిని తెలంగాణ ఉద్యోగులపై జరిగిన దాడేనని డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ, తెలంగాణ తహశీల్దార్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు ఎస్.రాములు, రమేష్ పాక, తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు బాణాల రాంరెడ్డి, వి.భిక్షం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు వేర్వేరు ప్రకటనలలో రమాదేవిపై మంగళవారం జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామికి చెందిన పురుషోత్తపట్నంలో ఉన్న భూమిలో అనుమతి లేకుండా భవన నిర్మాణ పనులు చేపడుతుండటంతో భద్రాచలం టెంపుల్ సిబ్బంది దాన్ని అడ్డుకునే క్రమంలో ఈవో రమాదేవిపై దాడి జరిగిందన్నారు. ఈదాడిపై ఏపీ ప్రభుత్వం కూడా తీవ్రంగా పరిణించాలని కోరారు. ఆలయ భూముల పరిరక్షణకు ఏపీ ప్రభుత్వం కూడా చొరవ చూపాలన్నారు.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో భద్రాద్రి రాముడికి సుమారు 1,300 ఎకరాల భూమి ఉండగా అందులో అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం పురుషోత్తపట్నంలోనే గరిష్ఠంగా 889.5 ఎకరాలు ఉందన్నారు. పురుషోత్తపట్నంలోని ఆలయ భూమి ఎక్కువ భాగం ఆక్రమణకు గురైందన్నారు. కోర్టు తీర్పు ప్రకారం ఈ భూమిపై దేవస్థానానికి హక్కులు లభించాయన్నారు.

పురుషోత్తపట్నంలోకి ప్రవేశించే మార్గంలో పిల్లర్లతో నిర్మాణ పనులు చేపడుతుండగా ఆలయ సిబ్బంది మంగళవారం అక్కడికి చేరుకున్నారన్నారు. అనుమతి లేకుండా ఇళ్ల నిర్మాణం చేయవద్దని, ఇది పూర్తిగా రాముడి భూమి అని వివరించారు. కోర్టు తీర్పులతో దేవుడి పేరిట పట్టాదారు పాసు పుస్తకాలు ఉన్నాయని వెల్లడించారు. అయినప్పటికీ ఈవో అభ్యంతరాలు వినకుండా స్థానికులు రమాదేవిపై దాడి చేశారన్నారు.

## ఫోటోగ్రాఫర్స్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించిన ఎమ్మెల్యే



మిర్యాలగూడ, జూలై 8(నీలగిరి ఎక్స్‌ప్రెస్) మిర్యాలగూడ పట్టణంలోని హౌసింగ్ బోర్డు పరిధిలో ఉన్న క్లియో స్పోర్ట్స్ గ్రౌండ్‌లో మంగళవారం మిర్యాలగూడ ఫోటోగ్రాఫర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌కు విశేష ఆదరణ లభించింది. ఈ కార్యక్రమాన్ని శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి , ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మరియు డీఎస్పీ రాజశేఖర్ రాజు ముఖ్య అతిథులుగా ప్రారంభించారు. టోర్నమెంట్ ప్రారంభ సందర్భంగా ప్రజా ప్రతినిధులు ఫోటోగ్రాఫర్ యూనియన్ సభ్యులతో కలిసి మైదానంలో బ్యాట్ పట్టి బంతిని ఎదుర్కొన్నారు. ఆటను ఆస్వాదిస్తూ, మైదానంలో తమ సరదా ప్రతిభను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బిఎల్ఆర్ మాట్లాడుతూ, "ఐక్యతే శక్తి. ఫోటోగ్రాఫర్స్ ఒక్కటిగా ఉండటానికి ఈ తరహా కార్యక్రమాలు మద్దతు చేకూరుస్తాయి. శ్రద్ధగా పనిచేస్తున్న యూనియన్ సభ్యులను అభినందిస్తున్నా" అన్నారు. ఫోటోగ్రాఫర్స్‌కి సామాజిక అవగాహన పెరిగేలా కార్యాచరణలు చేపట్టాల్సిన అవసరం ఉందని బిఎల్ఆర్ అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ఫోటోగ్రాఫర్స్ యూనియన్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, బిఎల్ఆర్ బ్రదర్స్, స్థానిక యువకులు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించడమే టీడబ్ల్యూజేఎఫ్ లక్ష్యం

**-టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా కార్యదర్శి సైదులు**
**-మహేశ్వరం నియోజకవర్గం టిడబ్ల్యూజేఎఫ్ నూతన కమిటీ ఎన్నిక**
**-నూతన కమిటీ అధ్యక్షుడిగా తడక నర్సింహా**
**-జర్నలిస్టు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా**




మహేశ్వరం జులై 8 (నీలగిరి ఎక్స్ ప్రెస్) జర్నలిస్టు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నూతన కమిటీ అధ్యక్షుడిగా తడక నర్సింహా అన్నారు. టిడబ్ల్యూజేఎఫ్ (తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్) జర్నలిస్టుల సమస్యలపై నిరంతరం న్యాయ పోరాటం చేస్తుందని టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా కార్యదర్శి సైదులు అన్నారు. మంగళవారం మహేశ్వరం మండల కేంద్రంలోని రఘుపతి కాంప్లెక్స్ లో టిడబ్ల్యూజేఎఫ్ మహేశ్వరం నియోజకవర్గం నూతన కమిటీని ఎన్నుకున్నారు.టిడబ్ల్యూజేఎఫ్ మహేశ్వరం నియోజకవర్గం నూతన కమిటీటిడబ్ల్యూజేఎఫ్ మహేశ్వరం నియోజకవర్గం అధ్యక్షుడిగా తడక నర్సింహ,కార్యదర్శిగా కోర్వి సురేందర్ ముదిరాజ్, ఉపాధ్యక్షులుగా రాందాస్, మిద్దింటి ప్రభాకర్,మీసాల శ్రీనివాస్ రావు, సహాయ కార్యదర్శులుగా పార్లకుర్ల వెంకటేష్,మారమోనీ ప్రశాంత్, కోశాధికారిగా రాజు, ప్రచార కార్యదర్శిగా రాజేశ్వరిని ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ రిపోర్టర్లు గణేష్ ,సురేష్, టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా నాయకులు శ్రీరాములు,శేఖర్, ఆంజనేయులు,చండీశ్వర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ అధ్యక్షుడు తడక నర్సింహా మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గం జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని అన్నారు.

## నల్గొండ అడిషనల్ కోర్టు ఏపీపీగా చిరుమర్రి రఘురాం రావు నియామకం



మిర్యాలగూడ, జూలై 8(నీలగిరి ఎక్స్‌ప్రెస్) పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది చిరుమర్రి రఘురాం రావు నల్గొండ జిల్లా అడిషనల్ సెషన్ కోర్టు (మిర్యాలగూడ)లో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ)గా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ సాంబశివారెడ్డి చేతుల మీదుగా రఘురాం రావు నియామక పత్రాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ % "ఈ బాధ్యతకు ఎంపిక చేసిన జిల్లా కలెక్టర్, జిల్లా జడ్జి మరియు మిర్యాలగూడ కోర్టుల జడ్జీలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను" అని పేర్కొన్నారు.

## జూలై 9న జరిగే అఖిల భారత సార్వత్రిక సమ్మె ను జయప్రదం చేయండి

**-ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి బి దత్తు నాయక్**




మహేశ్వరం,జులై 8 (నీలగిరి ఎక్స్ ప్రెస్) రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గ కేంద్రంలో ఏఐటియుసి ఐఎన్టియుసి ముఖ్య కార్యకర్తల సమావేశం ఏఐటీయూసీ కార్యాలయంలో నిర్వహించడం జరిగింది ఈ సమావేశానికి పి. దేవేంద్ర గౌడ్ అధ్యక్షత వహించారు. దీనికి ముఖ్య అతిథులుగా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి బి దత్తు నాయక్, ఏఐటియుసి మండల అధ్యక్షులు శివ వారు హాజరై మాట్లాడుతూ జులై 9న జరిగే అఖిల భారత సార్వత్రిక సమ్మెను కార్మికులు, ఉద్యోగస్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్ తెచ్చి కార్మిక హక్కులను హరిస్తోంది. నాలుగు లేబర్ కోడ్ ల ను వెంటనే రద్దు చేయాలని, 29 కార్మిక చట్టాలను పునర్దించాలని డిమాండ్ చేశారు. సార్వత్రిక సార్వత్రిక సమ్మెలో యావత్ కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కార్మిక లోకానికి ఆయన పిలుపునిచ్చారు. తుక్కుగూడ మంకల్ రావిరాల ఆదిభట్ల మహేశ్వరం కందుకూరు ఈ ప్రాంతాలలో వేలాది మంది కార్మికులు పనిచేస్తున్నారు. వారికి ఆరోగ్య సమస్యలు తలెత్తితే చూపించుకోవడానికి హాస్పటల్ లేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. వెంటనే ఈఎస్ఐ హాస్పిటల్లో నియమించాలని డిమాండ్ చేశారు తాత్కాలికంగా తుక్కుగూడ కేంద్రంలో ఈఎస్ఐ డిస్పెన్సర్ సెంటర్ నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు ఈ కార్యక్రమంలో ఏఐటియుసి మహేశ్వర మండల అధ్యక్ష కార్యదర్శులు పి దేవేంద్ర గౌడ్,కొమ్మ గళ్ళ రాజు,ఎం యాదగిరి,శివ,రమేష్,జోసఫ్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల నమోదు విషయంలో బిఎల్ఓలు ప్రతి ఇంటిని సందర్శించాలి

**• కలెక్టర్ పమేలా సత్పతి**




చొప్పదండి, జూలై 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) కొత్త ఓటర్ల నమోదు సందర్భంగా బూత్ లెవెల్ అధికారులు క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటినీ సందర్శించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి సూచించారు. మంగళవారం చొప్పదండిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బిఎల్వో శిక్షణ కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, "ఓటర్ల నమోదు, తొలగింపు ప్రక్రియలో బిఎల్వోలు అత్యధిక జాగ్రత్త తీసుకోవాలి. ఫారం 6, 7, 8 పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలి. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందేలా కృషి చేయాలి," అన్నారు. క్షేత్రస్థాయిలో వ్యక్తిగతంగా ఇంటింటి పరచి, ఆధారాలతో కూడిన సమాచారం ఆధారంగా ఓటర్ల జాబితా సవరించాలన్నారు. కొత్త నిబంధనలు, మార్పులు, సడలింపులపై పూర్తి అవగాహన అవసరమని, ఏ సందేహాలు ఉన్నా వెంటనే ఉన్నత అధికారులతో చర్చించి స్పష్టత పొందాలని సూచించారు. ఇంటర్ పూర్తి చేయని బిఎల్వోలు ఓపెన్ స్కూల్‌లో చేరి అర్హత పొందాలని ఆమె పేర్కొన్నారు. తప్పులేని, న్యాయసమ్మతమైన ఓటర్ల జాబితా తయారీలో బిఎల్వోల పాత్ర కీలకమని ఆమె స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, ఎంపీడీవో ఆర్. వేణుగోపాలరావు, డిప్యూటీ తహసిల్దార్ శ్రీనివాస్, ఎంసీ పి.ఓ రాజగోపాల్ రెడ్డి, ఎలక్షన్ డీటీ మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

## సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి టెంపుల్ కమిటీ మెంబర్ గా శంభుల శ్రీకాంత్ గౌడ్

-హర్షం వ్యక్తం చేసిన అంబర్పేట వాసులు...



అంబర్ పేట్, జూలై 8(నీలగిరి ఎక్స్‌ప్రెస్)
సికింద్రాబాద్ లోని శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి టెంపుల్ కమిటీ మెంబర్ గా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శంభుల శ్రీకాంత్ గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు దేవాదాయ శాఖ కమిషనర్ కార్యాలయం ఉత్తర్వులు జారిచేస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు. టెంపుల్ కమిటీ సభ్యులుగా 12 మందినీ నియమిస్తూ ఎండోమెంట్ అధికారి ప్రొసీడింగ్ ఇచ్చారు. శ్రీ మహంకాళి అమ్మవారి ఉత్సవాల సందర్భంగా ఈ నెల 11 నుండి 14 వరకు అమ్మవారి ఆలయంలో బాధ్యతలను నిర్వహించాలని దేవాదాయ శాఖ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అమ్మవారు ఉత్సవాలను ప్రశాంతంగా, సజావుగా నిర్వహించే బాధ్యతను టెంపుల్ కమిటీ తీసుకొని ఉన్నది.

## "డీట్" యాప్ ద్వారా ఉపాధికి మార్గయయువతకు అవగాహన అవసరం

-నిరుద్యోగులకు ఉపాధి అవకాశాల వేదికగా డీట్ యాప్
-విద్యార్థులు, స్కిల్ వర్కర్లకు ప్రభావవంతమైన వనరుగా అభివృద్ధి



కరీంనగర్, జూలై 8(నీలగిరి ఎక్స్‌ప్రెస్)
రాష్ట్రంలోని నిరుద్యోగ యువత, విద్యార్థుల ఉపాధి అవకాశాలను విస్తృతపరచేందుకు డీట్ యాప్‌ను ప్రభావవంతంగా వినియోగించుకోవాలని అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే సూచించారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా పరిశ్రమల కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలోని పరిశ్రమలు, సంస్థలు, గ్రానైట్ యూనిట్లు, రైస్ మిల్లులు డీట్ యాప్‌లో రిజిస్టర్ కావాలని సూచించిన ఆమె, ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు పొందేందుకు యువతకు ఇది మంచి వనరుగా నిలుస్తుందన్నారు. ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలల ఫైనల్ ఇయర్ విద్యార్థులు, స్కిల్ వర్కర్లు యాప్‌లో నమోదు కావాల్సిన అవసరం ఉందని వివరించారు. ఎంప్లాయర్లు తమకు అవసరమైన అర్హతలతో అభ్యర్థులను డీట్ యాప్ ద్వారా ఎంపిక చేసుకునే వెసులుబాటు ఉందని, రాష్ట్రవ్యాప్తంగా అనేక మంది యువతకు ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తాయని ఆమె పేర్కొన్నారు. ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి యాప్ వినియోగాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ సమావేశంలో మెప్మా పిడి వేణుమాధవ్, నెహ్రూ యువ కేంద్ర కోఆర్డినేటర్ రాంబాబు, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ సాల్మన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మాపూర్ వద్ద టేకు చెట్లను నరికిన దుండగులు

- రైతుకు 50 వేల రూపాయల నష్టం
-పట్టించుకోవాలంటూ పోలీసులకు విజ్ఞప్తి




పెద్దకొత్తపల్లి,జూలై 8(నీలగిరి ఎక్స్‌ప్రెస్)
మండలంలోని లక్ష్మాపూర్ గ్రామ శివారులో సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు టేకు చెట్లను నరికిన ఘటన కలకలం రేపింది. చిన్నకొత్తపల్లి గ్రామానికి చెందిన ఎత్తం హుస్సేన్ అనే రైతు వద్ద ఉన్న వ్యవసాయ భూమిలో వివిధ సంవత్సరాలుగా పెంచిన టేకు వృక్షాలను నరకడం ద్వారా 50 వేల రూపాయల వరకు ఆర్థిక నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయారు. ఈ మేరకు పెద్దకొత్తపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసిన రైతు, "లక్ష్మాపూర్ గ్రామానికి సమీపంగా ఉన్న తన పొలంలో రాత్రి వేళ చెట్లు నరికి తరలించారు. నరకిన వ్యక్తులను గుర్తించి చట్టపరంగా శిక్షించాలి," అని కోరారు. రైతు చేసిన అభ్యర్థన మేరకు, సంఘటనపై విచారణ కొనసాగుతోందని పోలీసు అధికారులు తెలిపారు. ప్రభుత్వం తమను ఆర్థికంగా ఆదుకోవాలని, ఇలాంటి దుర్మార్గ చర్యలకు చెక్ పెట్టే విధంగా చర్యలు తీసుకోవాలని బాధిత రైతు విజ్ఞప్తి చేశారు.

## మార్కండేయ్‌నగర్‌లో స్పెషల్ డ్రైవ్







కుత్బుల్లాపూర్,జూలై 8(నీలగిరి ఎక్స్‌ప్రెస్)
కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని మార్కండేయ్‌నగర్‌లో మంగళవారం సాయంత్రం పోలీస్ విభాగం ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. బాలానగర్ డివిజన్ ఏసీపీ నేతృత్వంలో, జీడిమెట్ల సీఐ గడ్డం మల్లేష్, ఐదుగురు ఎస్ఐలు, 40 మంది కానిస్టేబుళ్ల బలగంతో ఈ తనిఖీ చేపట్టారు. ఈ డ్రైవ్‌లో నంబర్ ప్లేట్‌లు లేని వాహనాలు, పెండింగ్ చలాన్లు ఉన్నవి, ఓనర్‌షిప్ వివరాలు లేకుండా తిరుగుతున్న వాహనాలు గుర్తించబడినట్టు సమాచారం. మొత్తం 45 టూ వీలర్లు, రెండు త్రీ వీలర్లు, ఒక ఫోర్ వీలర్‌ను తనిఖీ చేసి, అవసరమైన చట్టపరమైన చర్యలు తీసుకున్నారు. ఇదే సమయంలో అక్రమంగా నడుస్తున్న ఓ లిక్కర్ షాప్‌ను పట్టుకుని నియమిత అధికారులకు అప్పగించారు. పాత కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులకు ఏసీపీ బాలానగర్ కౌన్సిలింగ్ నిర్వహించారు. అలాగే, శంకాస్పదంగా తిరుగుతున్న పలువురిని పిలిపించి విచారణ చేపట్టారు. మైనర్ డ్రైవింగ్ చేసిన ఓ బాలుడి తల్లిదండ్రులను హాజరుపరచి, చట్టపరమైన నిబంధనలపై అవగాహన కల్పించారు.

## శ్రీశైలం డ్యామ్ గేట్లను ఎత్తి నీటి విడుదల

**చంద్రబాబుతో కలిసి పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ**
**అంతర రాష్ట్ర బ్రిడ్జికి మద్దతు కోరుతూ సీఎం చంద్రబాబుకు వినతిపత్రం**
**దేవస్థాన పాలక మండలిలో స్థానికులకు అవకాశమివ్వాలంటూ విజ్ఞప్తి**



అచ్చంపేట, జూలై 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, తెలంగాణ రాష్ట్ర అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణతో కలిసి శ్రీశైలం జలాశయం గేట్లను మంగళవారం ఎత్తివేసి అధికారికంగా నీటి విడుదల ప్రారంభించారు. శ్రీశైలంలోని కృష్ణ నదిలో నీటి ప్రవాహాన్ని పెంచేందుకు చేపట్టిన ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు రెండు ముఖ్యమైన అభ్యర్థనలు పత్రరూపంలో అందజేశారు. మద్దిమడుగు పరివాహ ప్రాంతంలోని కృష్ణ నదిపై అంతర రాష్ట్ర బ్రిడ్జిని నిర్మించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సహకరించాలని కోరారు. అలాగే, శ్రీశైలం దేవస్థాన పాలక మండలిలో అచ్చంపేట ప్రాంతానికి చెందిన ప్రతినిధులకు సభ్యత్వం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, రెండు రాష్ట్రాలకు చెందిన పార్టీ కార్యకర్తలు, దేవస్థాన సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఎంపీ వద్దిరాజు సన్నిహితులు ఆకుల రజిత్ పుట్టినరోజు వేడుకలు...





హైదరాబాద్,జూలై 8(నీలగిరి ఎక్స్‌ప్రెస్):
రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర సన్నిహితులు ఆకుల రజిత్ కుమార్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. కేబీఆర్ పార్క్ సమీపాన ఉన్న జింఖానా క్లబ్ లో సోమవారం రాత్రి జరిగిన వేడుకలకు ఎంపీ రవిచంద్ర, మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ పుటం పురుషోత్తం రావు పటేల్, జలవనరుల అభివృద్ధి సంస్థ మాజీ ఛైర్మన్ వీరమల్ల ప్రకాష్, పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాజీ సభ్యులు సీ.విఠల్, కరీంనగర్ జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ సత్తు మల్లేష్, హైదరాబాద్ మహానగర మాజీ మేయర్ బొంతు రాంమోహన్ తదితర ప్రముఖులు హాజరై రజిత్ చేత కేక్ కట్ చేయించి, శాలువాలతో సత్కరించి హృదయపూర్వక పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ప్రముఖ వ్యాపారవేత్తలు మరికల్ పోత సుధీర్ కుమార్, తూడి ప్రవీణ్, రూట్స్ విద్యా సంస్థల అధినేత పడాల భిక్షపతి, ప్రముఖ న్యాయవాదులు లవంగాల అనిల్, ఊసా రఘు, విశ్రాంత జాయింట్ కలెక్టర్ ఎర్రా నాగేంద్ర బాబు, సీనియర్ పాత్రికేయులు దుర్గం రవీందర్, సతీష్, ప్రముఖ వ్యాపారవేత్త కూసం శ్రీనివాసులు, కోదాడ సింగిల్ విండో మాజీ ఛైర్మన్ ఆవుల రామారావు, గో పరిరక్షకులు, సామాజిక వేత్త కాశెట్టి కుమార్, సినీ దర్శకులు సూర్యతేజ తదితర ప్రముఖులు ఈ వేడుకలకు హాజరై రజిత్ కుమార్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## వనపర్తి నియోజకవర్గ పరిధిలోని ప్రతి ఎకరాకు సాగునీరు

**-బుద్ధారం ఎడమ కాలువ, కూడి కాలువ, జాగిర్ధర్ కాలువ నుంచి వచ్చే నీరు ఆయకట్టుకు సరిపోడం లేదు**
**-ఏదుల నుంచి కేఎల్ఐకి లింకు కెనాల్ ఏర్పాటు**
**-జంగమయ్యపల్లి ఈదుల చెరువుకు అనుసంధానం**
**-రూ.78 కోట్ల రూపాయలతో బుద్ధారం స్టేజ్ టు రిజర్వాయర్ ఏర్పాటు**
**-గొల్లపల్లి రిజర్వాయర్ ఏర్పాటుకు చర్యలు చేపట్టిన ప్రభుత్వం**
**-డి 8, డి 5 వెడల్పు పెంచేందుకు ఆదేశాలు**
**-ఎల్లూరు పంప్ హౌస్ లోని మోటార్లను ప్రారంభించిన మంత్రి జూపల్లి ౦ కృష్ణారావు, ఎమ్మెల్యేలు మేఘారెడ్డి, రాజేష్ రెడ్డి,కసిరెడ్డి నారాయణరెడ్డిలు**



వనపర్తి జులై 08( నీలగిరి ఎక్స్ ప్రెస్):
రానున్న కాలంలో వనపర్తి నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కంకణబద్ధమై ఉందని వనపర్తి శాసనసభ్యులు. తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఎల్లూరు పంప్ హౌస్ వద్ద ఉన్న కల్వకుర్తి ఎత్తిపోతల మోటార్లను రాష్ట్ర మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు, వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి , నాగర్ కర్నూల్ శాసనసభ్యులు రాజేష్ రెడ్డి, కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డిలు మోటార్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ...పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల వలన వనపర్తి నియోజకవర్గం లోని ఏ ఒక్క సాగునీరు అందడం లేదని..ఏదుల రిజర్వాయర్కు సంబంధించి లింకు కెనాల్లు నేటి వరకు పూర్తి కాలేదన్నారు. గత నాయకులు పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల 90 శాతం పూర్తయిందని 10% పూర్తిచేస్తే సాగునీరు అందించవచ్చునని అబద్దాలను ప్రచారం చేస్తున్నారని ఆయన విమర్శించారు. ఏదుల రిజర్వాయర్ నుంచి వనపర్తి నియోజకవర్గం పరిధిలోని %ఖూ×% కెనాల్ కు లింకు కాలువలను ఏర్పాటు చేస్తే సాగునీటి సమస్య పూర్తిగా పరిష్కారం అవుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. త్వరలోనే నియోజకవర్గ పరిధిలోని 78 కోట్ల రూపాయలతో బుద్ధారం స్టేజ్ 2 రిజర్వాయర్, గొల్లపల్లి రిజర్వాయర్ నిర్మాణాలకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, అదేవిధంగా డి 8,D 5 కాలువలను వెడల్పు చేసేందుకు నివేదికలు తయారు చేస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పేద ప్రజల ఆరాధ్య దైవం డాక్టర్ వైఎస్ఆర్

**కడ్తాల్, జూలై 8(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

జనహృదయ నేత, మన ప్రియతమ దివంగత మహానేత మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ రాజశేఖర్ రెడ్డి గారి జయంతి సందర్భంగా కడ్తాల్ మండల్ కేంద్రంలోని మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బీచ్యా నాయక్ ఆధ్వర్యంలో వారి సేవలను గుర్తు చేసుకుంటూ తమ ఆశయాలను కొనసాగించాలని కోరుతూ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా పిసిసి కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్ గౌడ్, డిసిసి అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, అమనగల్ మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ - గూడూరు భాస్కర్ రెడ్డి గార్లు మాట్లాడుతూ డా.వైఎస్ఆర్ గారు పేదల ఆశాజ్యోతి, తెలుగు ప్రజల ఆరాధ్య నాయకుడని కొనియాడారు. 108 అంబులెన్స్, ఆరోగ్యశ్రీ, రెండు రూపాయలకే కిలో బియ్యం, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్,




అసరా పెన్షన్లు, రైతుల రుణామాఫీ, మైనార్టీలకు 4%రిజర్వేషన్లు మరియు మరెన్నో సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టిన నాయకుడని అన్నారు. రాష్ట్రంలో సంక్షేమ విప్లవం తీసుకొచ్చి అనుక్షణం పేదల సంక్షేమం కోసమే ఆరాటపడే నాయకుడు అని అన్నారు. ప్రజల గుండెల్లో ఎప్పుడు చిరస్థాయిగా నిలిచిన వ్యక్తి వైఎస్ రాజశేఖర్ రెడ్డి గారని అన్నారు.

ఈకార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు హన్మా నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నరసింహ, సింగిల్ విండో డైరెక్టర్ వెంకటేష్, మార్కెట్ డైరెక్టర్ నరేష్, సీనియర్ట్ నాయకులు లక్ష్మయ్య, జహంగీర్ అలీ, సత్యం యాదవ్, యాదయ్య గౌడ్, బాలరాజు, లక్ష్మణ్ నాయక్, రామకృష్ణ, లకృతి నాయక్, జవహర్, బిక్షపతి, శ్రీను, మల్లయ్య, నరేందర్, రంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి క్యామ రాజేష్, కల్వకుర్తి అసెంబ్లీ ఉపాధ్యక్షులు షాబుద్దీన్, మండల అధ్యక్షులు బోస్ రవి, స్టాలిన్, భానుకిరణ్, రమేష్, మల్లేష్, తులసి రామ్, తదితరులు పాల్గొన్నారు.

# బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య

**హైదరాబాద్,జులై 08 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

జగిత్యాల జిల్లా జాబితాపూర్ గ్రామంలో ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. చదువులో వెనుకబడిందన్న కారణంతో స్నేహితురాళ్లు చేసిన అవమానం తట్టుకోలేక ఓ బీటెక్ విద్యార్థిని తన ప్రాణాలు కోల్పోవడం విద్యార్థుల లోలోపల గుండెను కలిచివేసింది.పోలీసుల కథనం ప్రకారం, జగిత్యాల జిల్లా జాబితాపూర్‌కు చెందిన కాటిపెల్లి నిత్య (21) హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీ లో ఓ ప్రైవేటు వసతి గృహంలో నివసిస్తూ, అక్కడే ఉన్న ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతోంది. చదువులో మంచి ప్రతిభ కలిగిన నిత్య ఇటీవల కొంతకాలంగా మానసిక ఒత్తిడిలో ఉన్నట్లు తెలుస్తోంది

**- ఏ మేరకు బాధపడ్డదో అర్థం చేసుకోవచ్చు**

ఇటీవల, ఆమెకు ఎంతో సన్నిహితంగా ఉన్న స్నేహితురాళ్లు నిత్యను "చదువులో వెనుకబడావు, నీ వల్ల కాదు" అంటూ అవమానించారట. ఈ మాటలు నిత్య మనసులో బలంగా ముద్రపడ్డాయి. స్నేహితులే ఇలాంటివి మాట్లాడారంటే ఏ మేరకు బాధపడ్డదో అర్థం చేసుకోవచ్చు. ఆత్మవిశ్వాసాన్ని కోల్పోయిన నిత్య, జూలై 5వ తేదీన ఇంటికి వెళ్లిన తర్వాత తీవ్రంగా మనస్తాపానికి గురై గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. అక్కడ నాలుగు రోజుల



పాటు చికిత్స పొందిన నిత్య, పరిస్థితి మెరుగుపడక అక్కడే మంగళవారం రాత్రి మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు జగిత్యాల రూరల్ ఎస్సై సుధాకర్ తెలిపారు. ఈ సంఘటనతో గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. బంగారు భవిష్యత్ ఉన్న అమ్మాయి చనిపోవడంతో తల్లిదండ్రులు జీర్ణిచుకోలేకపోతున్నారు.

**- చిన్న మాటలతో ఎంతటి దారుణ సంఘటనలు జరుగుతున్నాయో**

ఆత్మహత్యకు దారితీసిన కారణాలను దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. నిత్య ఫోన్ డేటా, హాస్టల్ ఫ్రెండ్స్ స్టేట్‌మెంట్స్ ఆధారంగా విచారణ కొనసాగుతోందని చెప్పారు.ఈ సంఘటన విద్యార్థుల్లో మానసిక ఆరోగ్యం పై మరింత అవగాహన అవసరమని సూచిస్తోంది. చిన్న మాటలతో ఎంతటి దారుణ సంఘటనలు జరుగుతున్నాయో ఈ ఘటన మరోసారి గుర్తు చేస్తోంది. యువతకు ఒత్తిడిలో ఎలా స్పందించాలో నేర్పించాల్సిన అవసరం ఇప్పుడు అత్యవసరంగా మారింది.విద్యార్థుల మధ్య అవమానకర వ్యాఖ్యలు, ఎదురు మాటలు ఎంతటి తీవ్రంగా ప్రభావం చూపుతాయో, నిత్య మృతి అందుకు దుర్ఘటనగా నిలిచింది. ఒక చిన్న మాట, ఓ అవమానం ఎంతటి వెలకట్టలేని నష్టాన్ని కలిగించవచ్చో ఈ సంఘటన అందరికీ గుణపాఠం కావాలి.

# కంపెనీలో మంటలు .. ఓ కార్మికుడి గాయాలు, హాస్పిటల్ కు తరలింపు

**యాదాద్రి,జులై 08 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**

యాదగిరిగుట్ట మండలం పెద్దకందుకూరు గ్రామశివారులో ఉన్న ప్రీమియర్ ఎక్స్ ప్లోజివ్స్ కంపెనీలో ప్రమాదం జరిగింది. కంపెనీలోని పీఆర్డీసీ సెక్షన్-2 బిల్డింగ్ లో ప్రొడక్షన్ మిన్సింగ్ పనులు జరుగుతుండగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో అదే బిల్డింగ్ లో విధులు నిర్వర్తిస్తున్న తాళ్లగూడెం గ్రామానికి చెందిన కుచ్చుల బాలరాజుకు స్వల్ప గాయాలు అయినట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో కార్మికుడి చేతులు, ముఖానికి స్వల్పంగా కాలిన గాయాలు కావడంతో భువనగిరి ఏరియా హాస్పిటల్




లో ఫస్ట్ అయిడ్ చేసి మెరుగైన చికిత్స కోసం సికింద్రాబాద్ యశోద హాస్పిటల్ కు తరలించినట్లు కంపెనీ హెచ్ఆర్ డిప్యూటీ మేనేజర్ కరుణాకర్ రెడ్డి వెల్లడించారు. కార్మికుడు బాలరాజుకు ఆరోగ్యం నిలకడగా ఉందని, ఎలాంటి ప్రాణాపాయం లేదని యశోద డాక్టర్లు స్పష్టం చేశారని తెలిపారు.

**- 'ప్రీమియర్' కంపెనీలో తరచూ ప్రమాదాలు..**

ప్రీమియర్ ఎక్స్ ప్లోజివ్స్ కంపెనీలో తరచూ ప్రమాదాలు జరుగుతుండడంతో.. కంపెనీలో పనిచేస్తున్న కార్మికులు భయాందోళన చెందుతున్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నా కంపెనీ యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని కార్మికులు ఆరోపిస్తున్నారు. ఈ ఏడాది జనవరి 4న పేలుడు సంభవించి ఓ కార్మికుడు చనిపోగా, ముగ్గురికి గాయాలయ్యాయి. ఏప్రిల్ 29న కాటేపల్లిలోని ప్రీమియర్ ఎక్స్ ప్లోజివ్స్ ప్లాంట్ లో సంభవించిన భారీ పేలుడు ధాటికి ముగ్గురు చనిపోయారు.

# ప్రజల హృదయాలు గెలిచిన నేత వైఎస్సార్

**వైఎస్సార్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు**




**వలిగొండ జులై 08 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**

తెలుగు రాష్ట్రాల ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రజల హృదయాలను గెలుచుకున్న మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పాశం సత్తిరెడ్డి అన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని పురస్కరించుకుని బుధవారం వలిగొండ మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాతూ సంక్షేమ పథకాలతో పేదల గుండెల్లో చిర స్థాయిగా నిలిచిన అపర భగీరథుడు డాక్టర్ వైఎస్సార్ అని అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ భూక్య భీమానాయక్ పట్టణ అధ్యక్షులు కంకల కిష్టయ్య బత్తిని లింగయ్య సహదేవ్ ఉలిపే మల్లేశం చిలుగూరి సత్తిరెడ్డి మామిడి నరేందర్ రెడ్డి కాసుల వెంకన్న పాలకూర్ల వెంకటేశం యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు మైసొల్ల ప్రవీణ్ పులిపలుపుల రాములు గౌడ్ ఎస్.కె రసూల్ బత్తిని వరుణ్ బుగ్గ ఉదయ్ ఎదురుగట్ల బాలు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# రోడ్డు ప్రమాద బాధిత కుటుంబానికి పరామర్శించిన తల్లోజు ఆచారి



**కల్వకుర్తి,జూలై 8(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

కల్వకుర్తి పట్టణానికి చెందిన శ్రీనివాస్ గౌడ్ మరియు ఆయన కుమారుడు భాను ప్రకాష్ గౌడ్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం తీవ్ర విషాదాన్ని కలిగించింది. ఈ విషాద వార్త తెలుసుకున్న జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి మంగళవారం వారి నివాసానికి వెళ్లి మృతి చెందిన వారిద్దరికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. పరిస్థితి ముందుగా తెలిసిన సమయంలో తల్లోజు ఆచారి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, "ఇది తీరనీయ తీరని విషాదం. అధైర్య పడకుండా ధైర్యంగా ఎదుర్కోవాలి" అని భరోసా కల్పించారు. మృతుల కుటుంబానికి అవసరమైన అన్ని విధమైన సహాయం అందించేందుకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు



**యాచారం,జూలై 08(నీలగిరి ఎక్స్‌ప్రెస్**

యాచారం మండలం లోని పర్యటనలో భాగంగా ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు శ్రీ మల్ రెడ్డి రంగారెడ్డి పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన చేశారు. యాచారం మండలం లోని కొత్తపల్లి, తక్కెళ్ళపల్లి, నందివనపర్తి, నజ్జిక్ సింగారం, అయ్యవారి గూడెం, యాచారం గ్రామాల్లో సుమారు 1 కోటి 79 లక్షల రూపాయల వ్యయం తో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.అలాగే పలు గ్రామాల్లో సీసీ డ్రైనేజీలు, సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు గావించారు. పండుగ వాతావరణంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమాలను నిర్వహించారు. కాంగ్రెస్ హయాంలోనే గ్రామాలాభివృద్ధి చెందుతున్నాయని ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రెండు లక్షల రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి , రైతు భరోసా , ఇందిరమ్మ ఇండ్ల ఇతర అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభోత్సవం చేసినట్లు ఎంఎల్ఏ మల్ రెడ్డి రంగారెడ్డి చెప్పారు.ఈ కార్యక్రమంలో యాచారం ఎంపీడీవో రాధారాణి , ఎంపీ ఓ శ్రీలత, ఏ ఓ రావినాథ్ , కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మస్కు నరసింహ , మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు , కంబాలపల్లి ఉదయ శ్రీ, మాజీ ఎంపీటీసీ మాధవి, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మాడుగులలో బస్సు ఢీకొన్న యువకుడు మృతి



**మాడుగుల,జూలై 8(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

మండల కేంద్రంలోని సెయింట్ మేరీ స్కూల్ సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో 28 ఏళ్ల యువకుడు దుబ్బా రవికాంత్ అక్కడికక్కడే మృతి చెందాడు. మాడుగులకు చెందిన రైతు దుబ్బ వెంకటయ్య కు పెద్ద కుమారుడైన రవికాంత్, బ్రాహ్మణపల్లి గ్రామం వైపు పని నిమిత్తం తన ద్విచక్ర వాహనంపై (ఏపీ29 బిఈ6742) వెళ్లుతూ బస్సు ఢీకొన్న ఘటనలో ప్రాణాలు కోల్పోయాడు. హైదరాబాద్ నుండి అప్పారెడ్డిపల్లి వైపు వెళ్తున్న ఇబ్రహీంపట్నం డిపోకు చెందిన బస్సు (ఏపీ29జెడ్3302) సెయింట్ మేరీ స్కూల్ వద్ద రవికాంత్ వాహనాన్ని వేగంగా ఢీకొట్టినట్లు తెలుస్తోంది. తలకు తీవ్రమైన గాయాలై సంఘటన స్థలంలోనే మృతి చెందినట్లు పోలీసులు పేర్కొన్నారు. బాధితుని తండ్రి దుబ్బ వెంకటయ్య ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా మాడుగుల పోలీసులు కేసు నమోదు చేసి, ప్రమాదానికి కారణమైన డ్రైవర్ పై విచారణ ప్రారంభించినట్లు సీఐ తెలిపారు.